ఇచ్చారు.. తీసేశారు
- శావల్యాపురం - రొంపిచర్ల మార్గంలో నెలాఖరు వరకే

తగ్గిన వరద
ఊపిరి పీల్చుకుంటున్న తీరప్రాంత ప్రజలు

ప్రతి విద్యార్థికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు
- రెండో సారి దరఖాస్తు చేసుకోకుండా ఆధార్‌తో సర్టిఫికెట్లు జారీ
- ఉమ్మడి జిల్లాలో సర్టిఫికెట్లు జారీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

8

సర్‌చార్జి.. పెండింగ్

- 1172 పంచాయతీలకు రూ.30 కోట్లు..
- నెలలు తరబడి నిలిచిపోయిన చెల్లింపులు
- సర్‌చార్జి కోసం స్థానిక సంస్థల ఎదురుచూపు
- సీఎఫ్ఎంఎస్‌తో నిధుల విడుదలకు అంతరాయం

ప్రభుత్వం నుంచి నిధులు రాక.. ఆర్థిక సంఘం నిధుల విడుదలలో జాప్యంతో.. న్యాయబద్ధంగా రావాల్సిన సర్‌చార్జి కూడా అందక పంచాయతీలు ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానిక సంస్థల ప్రధాన ఆదాయ వనరుల్లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే సర్‌చార్జి(ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) ముఖ్యమైనది. ప్రతి రిజిస్ట్రేషన్‌లోనూ వసూలు చేసే 1.5 శాతం సర్‌చార్జిని జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు జమ చేయాలి. గతంలో రిజిస్ట్రార్లు ఎప్పటికప్పుడు లెక్కలు వేసి దామాషా పద్ధతిలో చెల్లింపులు చేసేవారు. సీఎఫ్ఎంఎస్(కాంప్రహెన్సివ్ ఫైనాన్స్ సిస్టం) అమల్లోకి వచ్చిన తర్వాత ఆ స్టాంప్‌డ్యూటీ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లోకి వెళ్తుంది. అక్కడ నుంచి స్థానిక సంస్థలకు చెల్లింపులు జరగాలి. అయితే ఈ ప్రక్రియ సక్రమంగా జరగడంలేదు. జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు సర్‌చార్జి ఎంత బకాయి ఉన్నదో చెప్పేందుకు కూడా రిజిస్ట్రేషన్ శాఖ తటపటాయిస్తోంది.

జడ్పీకి రూ.28 కోట్ల బకాయి

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు సర్‌చార్జి చెల్లింపులు పెండింగ్ పెట్టారు. ఆరేళ్ల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు సర్‌చార్జి రూపేణా సుమారు రూ.65 కోట్ల వరకు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కేవలం రూ.37 కోట్లు మాత్రమే చెల్లించినట్లు లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన రూ.28 కోట్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అసలు ఏ సంవత్సరం వరకు సర్‌చార్జి జమ అయ్యిందో కూడా సమాచారం లేదని సంబంధిత పాలకవర్గాలు వాపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1172 గ్రామ పంచాయతీలకు సర్‌చార్జి చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పంచాయతీలకు ఏడాదిగా సర్‌చార్జి రాలేదు. గ్రామ పంచాయతీలకు సుమారు రూ.30 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. సర్‌చార్జి నిధులు జమ కాకపోవడంతో పంచాయతీల్లో కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపులతో పాటు ఇతర కార్యకలాపాలు జరగని దుస్థితి నెలకొంది.



మాదేమీ లేదంటున్న రిజిస్ట్రార్లు

సర్‌చార్జి చెల్లింపుల కోసం జిల్లా రిజిస్ట్రార్లను పలువురు సర్పంచ్‌లు కలుస్తున్నారు. నిధులు జమలో తమకు సంబంధం లేదని ఐజీ (మిగతా 6వ పేజీలో)



బాపట్ల డిపోలో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

స్త్రీశక్తితో మహిళల్లో సంతోషం

బాపట్లలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన స్త్రీశక్తి పథకం సజావుగా కొనసాగుతుందని ఉచిత ప్రయాణంపై మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. శుక్రవారం ఆయన బాపట్ల డిపో, గ్యారేజిలను సందర్శించి డిపోలో ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. ఉచిత బస్సు సర్వీసులపై డిపోలోని ప్రయాణికులు రమాదేవి, పూజామణిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంపై ముందస్తుగా అధ్యయనం చేసి పొరపాట్లు జరగకుండా అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఆదా అవుతుందన్నారు. స్త్రీ, పురుషుల నిష్పత్తి గతంలో 40-60గా ఉండేదని, ఉచిత ప్రయాణంతో అది 65-35గా మారిందన్నారు. దీనివల్ల ఆర్టీసీకి ఆదాయం తగ్గినా మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మహిళా ప్రయాణికులకు త్వరలో స్మార్ట్‌కార్డులు అందజేస్తామని, వాటితో ఆధార్‌కార్డుతో అవసరం లేకుండా ప్రయాణించవచ్చన్నారు. బస్టాండ్లలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ పరిశుభ్రత, ప్రయాణికులు కూర్చొనేందుకు సీట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో డి.సామ్రాజ్యం, ఈడీ నాగేంద్రప్రసాద్, ఇన్‌చార్జి డీఎం జె.శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ గ్యారేజిని పరిశీలించి కార్మికులతో కూడా సమావేశమయ్యారు.



డిపోలో వసతులను పరిశీలిస్తున్న ద్వారకా తిరుమలరావు



శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం చందోలులోని శ్రీబగళాముఖి అమ్మవారిని శ్రావణ స్కందమాతగా అలంకరించారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆవులదొడ్డికొత్తగొల్లపాలేనికి రూ.25 లక్షలు మంజూరు



చినగంజాం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు హామీతో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో పెదగంజాం పంచాయతీ ఆవులదొడ్డికొత్తగొల్లపాలెంలో ఏళ్లనాటి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నది. డీఎంఎఫ్ నిధులను రూ.25 లక్షలు మంజూరు చేస్తూ కలెక్టర్ జె.వెంకటమురళి ఉత్తర్వులు జారీ చేశారు. పేదల సేవలో భాగంగా 2025 ఏప్రిల్ 1న ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం పర్యటన సమయంలో గ్రామం లోని నీటి సమస్యను ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని కోరారు. దీనికి స్పందించిన సీఎం నిధులు మంజూరు చేయాలని అధికారులను అప్పట్లో ఆదేశించారు. ఈ క్రమంలో తాజాగా విడుదలైన నిధులతో ఇంటింటికి తాగునీరు అందేలా పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించారు. పనులు పూర్తి అయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

భూగర్భ జలమట్టాలు పెరగాలి

- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భజలమట్టాలు పెరిగేవిధంగా అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. జలవనరులు, భూగర్భజలశాఖాధికారులతో శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోస్తా జిల్లా అయిన బాపట్ల ప్రాంతంలో భూగర్భజలమట్టం తగ్గుముఖం పట్టటం పర్యావరణానికి మంచిదికాదన్నారు. పూడికతీత పనులు చేపట్టి, కాల్వలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి భూగర్భజలాలను పెంచాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలోని కొండల అంచుల వద్ద ఇంకుడుగుంతలు, పంటగుంతలు నిర్మించాలన్నారు. ఉపాధి నిధులను అనుసంధానిస్తూ ఆయా పనులు చేపట్టాలన్నారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో పంట కాల్వల మధ్యలో బోర్లులు వేసి భూగర్భజలాలు పెరగడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇసుకతవ్వకాలతో కృష్ణానదీ తీరంలోని కొల్లూరు మండలంలోను భూగర్భజలమట్టం తగ్గుతుందని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. బాపట్లలో తాగునీటి చెరువు కట్ట బలోపేతం, పూడికతీత పనులకు రూ.8 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి తక్షణమే పంపాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జలవనరులశాఖ ఎస్ఈ అబూతలీమ్, భూగర్భజలశాఖ ఏడీ సురేష్, డ్వామాపీడీ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రూ.15 లక్షల సొత్తు, రెండు బైకులు స్వాధీనం



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్రావు, ఎస్ఐలు నాగరాజు, పట్టాభిరామయ్య

బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే వ్యసనాలతో చోరీలను ఓ అలవాటుగా చేసుకున్న కత్తి రవికుమార్ అనే అంతర్ జిల్లా దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకి చెందిన రవికుమార్‌ను బల్లికురవ పోలీసు స్టేషన్‌లో మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు ప్రకటించారు. చిల్లర దొంగతనాలకు అలవాటు పడి పలు కేసుల్లో జైలుకు వెళ్లడం, బెయిల్‌పై వచ్చి మళ్లీ దొంగతనాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో జైలు నుంచి వచ్చిన రవికుమార్ తూర్పు గోదావరి జిల్లా పెదపాడులో చోరీలు చేస్తుండగా పట్టుబడి జైలుకు వెళ్లి ఈ నెల 1న విడుదలయ్యాడు. ఆ తర్వాత 4న పల్నాడు జిల్లా నాదెండ్లలో, 5న బాపట్ల జిల్లా బల్లికురవ మండలం రామాంజనేయపురంలో, 15న తూర్పుగోదావరి జిల్లాలో, 17న కర్నూలు జిల్లాలో చోరీలకు పాల్పడ్డాడు. రామంజనేయపురం గ్రామంలో జరిగిన చోరీ కేసులో బల్లికురవ, సంతమాగులూరు ఎస్ఐలు వై.నాగరాజు, పట్టాభిరామయ్యలు రెండు బృందాలుగా ఏర్పడి విచారణ క్రమంలో దొంగను గొర్రెపాడులో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 102 గ్రాముల బంగారం, వెండి వస్తువులు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు అద్దంకి కోర్టుకు హాజరు పరిచారు. అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసిన డీఎస్పీ రామాంజనేయులు, సీఐ వెంకట్రావు, ఎస్ఐలు వై.నాగరాజు, పట్టాభిరామయ్యలకు ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

- నేతన్నల నుంచి భారీగా దరఖాస్తులు
- షెడ్డు కార్మికులకూ వర్తింపజేసేందుకు కసరత్తు
- గుంటూరు జిల్లాలో 2,460, పల్నాడులో 280 మంది గుర్తింపు
- బాపట్ల జిల్లాలో 7 వేలకు పైగా కుటుంబాలకు చేకూరనున్న లబ్ధి



చీరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఊరట కల్పించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఈ నెల 7న మంగళగిరిలో జరిగిన చేనేత దినోత్సవంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ రోజు నుంచే పథకం అమలు లోకి వస్తుందని ప్రకటించిన విషయం తెలి సిందే. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ముమ్మరంగా సాగుతోంది. ఈ ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేస్తున్నారు. చేనేత, జౌళీ శాఖ జిల్లా కార్యాలయ పర్యవేక్షణలో లబ్ధిదారుల జాబితాలను అధికారులు రూపొందిస్తున్నారు. చేనేత కార్మికులుగా గుర్తింపు ఉన్న కార్మికుల ఇళ్లకు వెళ్లి వాళ్ల వివరాలను సేకరిస్తున్నారు. చేనేత గుర్తింపు కార్డు కలిగి ఉండడం, ఇళ్లలో చేనేత మగ్గం ఉండడం ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం (మిగతా 6వ పేజీలో)

దొరికితేనే దొంగలు

- యథేచ్ఛగా గ్రానైట్ దందా
- అధికారులకు ముడుపులతో అక్రమ రవాణా
- ఏటా రూ.250 కోట్ల ఆదాయం కోల్పోతున్న గనులశాఖ

అద్దంకి/బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ దందాలో దొరికితేనే దొంగ.. లేదంటే దొరలాగా వెళ్లిపోతున్నారు. బిల్లులు లేకుండా యథేచ్ఛగా అక్రమంగా రవాణా జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా ఉండటంతో గ్రానైట్ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి ఎగుమతి చేసే గ్రానైట్ శ్లాబులకు రాయల్టీ, జీఎస్టీ, ఇతర రుసుములు కలిపి సుమారు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ప్రభుత్వానికి చెల్లించాలి. రాష్ట్ర సరిహద్దు దాటితే బిల్లులతో పని ఉండదు. ప్రభుత్వానికి రోజుకు రూ.70 లక్షల చొప్పున నెలకు రూ.20 కోట్లు ఏడాదికి రూ.250 కోట్ల ఆదాయం గనులశాఖ కోల్పోతుంది. బిల్లులు లేకుండా రాష్ట్ర సరిహద్దు దాటించేందుకు గత దశాబ్ద కాలంగా ప్రత్యేకంగా బృందాలు ఏర్పడ్డాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు దీనిని ఓ వృత్తిగా ఎంచుకోగా కూటమి ప్రభుత్వంలోనూ అదే పంథా కొనసాగుతుంది. నిత్యం 100కు పైగా గ్రానైట్ శ్లాబుల లారీలు ఇక్కడి నుంచి వెళ్తుండగా వాటిలో బిల్లులు ఉన్నవి పట్టుమని పది కూడా ఉండవు. బిల్లులు లేకుండా లారీని సరిహద్దు దాటించే బృందానికి గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని రూ.40 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. రూ.20 వేలను ఆ బృందాలు వివిధ శాఖల అధికారులకు మామూళ్లుగా సమర్పించి గ్రానైట్ లారీలను అడ్డుకోకుండా చేస్తారని తెలిసింది. ఇలా ఒక్కో ముఠా ఐదారు లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తుంటుంది. అంటే ఒక్కో ముఠాకు రోజుకు కనీసం రూ.లక్ష మిగులుతుండగా గ్రానైట్ యజమానికి ఒక్కో లారీ ద్వారా రూ.40 వేల పన్నులు ఆదా అవుతాయి. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలతో సరిపెడుతుంటారు. ఎప్పుడైనా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు మాత్రం గ్రానైట్ శ్లాబుల లారీలపై కేసులు నమోదు చేస్తుంటారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం బల్లికురవ మండలంలో రెండు శ్లాబుల లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



బల్లికురవ పోలీస్ స్టేషన్ వద్ద పట్టుబడ్డ గ్రానైట్ శ్లాబుల లారీలు

సదరం కోసం పడిగాపులు

- రేపల్లె ఆస్పత్రికి తరలివచ్చిన దివ్యాంగులు
- క్యాంపుపై సమాచారం లేదన్న డీఎంహెచ్‌వో



దివ్యాంగురాలు



నోటీసును చూపిస్తున్న వెంకటేశ్వరమ్మ

రేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్లు నిలిచిపోయిన బాధితులు తిరిగి సదరం సర్టిఫికెట్ కోసం వ్యయప్రాయాలకు ఓర్చి ఆస్పత్రికి రాగా అసలు ఆ సమాచారమే తమకు లేదని వైద్యాధికారులు ముఖం చాటేశారు. దీంతో దివ్యాంగులు పడిగాపులతో వెనుతిరగాల్సి వచ్చింది. రేపల్లె పరిధిలోని సచివాలయ సిబ్బందికి.. వైద్యాధికారులకు మధ్య సమన్వయం కొరవడంతో దివ్యాంగులు తిప్పలు పడాల్సి వచ్చింది. ఇటీవల ప్రభుత్వం దివ్యాంగ పింఛన్లలో అనర్హులను తొలగించింది. వారిలో అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో పింఛన్లు నిలిచిపోయిన వేమూరు నియోజకవర్గ పరిధిలోని బాధితులు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. రేపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంప్‌నకు వెళ్లి పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లను అందిస్తే పింఛన్లు పునరుద్ధరణ జరుగుతుందని సచివాలయాల సిబ్బంది బాధితులకు నాలుగు రోజుల క్రితం సూచించారు. దీంతో సుమారు 50 మంది బాధితులు ఆయా ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రాయాసలకు ఓర్చి శుక్రవారం రేపల్లె ప్రభుత్వవైద్యశాలకు చేరుకున్నా రు. ఎంత సేపటికీ వైద్యులు రాకపోవడంపై ఆస్పత్రిలోని సిబ్బందిపై దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపుపై తమకు ఆదేశాలు రాలేదని తాము ఏమీ చేయలేమని స్థానిక వైద్యులు చెప్పారు. సచివాలయ సిబ్బంది ఇక్కడ సదరం క్యాంపు ఉందని చెప్తేనే వచ్చామని వరికూటి వెంకటనారాయణ, వెంకటేశ్వరమ్మ, పీతల కిరణ్ తదితరులు తెలిపారు. ఎన్నో ఇబ్బందులు పడి వస్తే ఎవరూ స్పందించలేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో విజయమ్మను వివరణ కోరగా క్యాంపుపై తమకు కనీస సమాచారం కూడా లేదని, మూడురోజుల తర్వాత అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రభుత్వ వైద్యశాలలో వేచి చూస్తున్న బాధితులు

నైపుణ్యాల మెరుగునకు ఏఎన్‌యూ ఒప్పందం


ఒప్పంద పత్రాలు చూపుతున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ మధ్య శుక్రవారం ఒప్పందం కుదిరింది. స్కిల్ డిజైర్ డైరెక్టర్ ఎం.శ్రీకాంత్, ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఎంఓ యూ పత్రాలు మార్చుకున్నారు. వర్సి టీలోని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బందికి నైపుణ్యాలు మెరుగుపడటానికి ఈ ఒప్పందం తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం, మాస్టర్ క్లాసెస్, టెక్నికల్ ట్రైనింగ్స్‌ను ఉచితం ఇవ్వనున్నారు. రిజిస్ట్రార్ సింహాచలం, రెక్టార్ రత్న శిలామణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్. లింగరాజు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసి పనిచేస్తున్నదని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ తెలిపారు. మండలంలోని ఈస్ట్ బాపట్ల రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఎరువుల పంపిణి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూలపాలెం, పిన్నిబోయినవారిపాలెం, ఈతేరు, నందిరాజుతోట రైతు సేవాకేంద్రాలు ఒక్కొక్కదానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా రావటం జరిగిందన్నారు. అప్పికట్ల, కంకటపాలెం, మూలపాలెం, మరుప్రోలువారిపాలెం, గుడిపూడి, పూండ్ల, బాపట్ల జీడీసీఎంఎస్ పాయింట్‌లకు మొత్తం 170 మెట్రిక్ టన్నుల యూరియా 190మెట్రిక్ టన్నుల డీఏపీ రానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, ఏడీఏ కె.ధనరాజు, ఏఓ కె. శారద తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న భూముల పరిశీలన

కొల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వరద ఉధృతికి కోతకు గురవుతున్న పంట భూములను సాగునీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికిరణ్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని తిప్పలకట్టలో రైతులతో కలిసి పర్యటించారు. నదీ ప్రవాహ దిశను మళ్లించేందుకు మూడు చోట్ల గ్రాయిన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఈఈ రవికిరణ్ తెలిపారు. త్వరలోనే అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే గ్రాయిన్స్ నిర్మాణం ప్రారంభిస్తామని రైతులకు తెలిపారు. ఆయన పరిశీలనలో ఈఈ వెంట ఆర్‌సి జేఈలు విజయరాజు, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్యుల సమస్యల్ని తప్పక పరిష్కరిస్తాం

● ఐఎంఏ రాష్ట్ర బృందానికి సీఎం హామీ


సీఎంకు సమస్యలను వివరిస్తున్న నందకిషోర్

గుంటూరు మెడికల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాలలో సేవల్ని మరింత విస్తృతపరచడంలో, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ఐఎంఏ ఎల్లప్పుడు ప్రభుత్వానికి సహకరిస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి నందకిషోర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. శుక్రవారం ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు, డాక్టర్ ఎం.జయచంద్ర నాయుడు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.సురేష్‌తో కలసి ఆయన వైద్యుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ ఏపీ ఐఎంఏ శాఖలో 25 వేల మంది వైద్యులు ఉన్నారని వివరించారు. వృత్తిపరంగా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చామన్నారు. ముఖ్యంగా వైద్యులపై దాడుల విషయంలో ప్రస్తుతం ఉన్న చట్టంలో మరికొన్ని మార్పులు చేయాలని కోరామన్నారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ల విషయంలో అగ్నిమాపక శాఖ నిబంధనలను కొన్నింటిని సవరించాలని సూచించారు. అదేవిధంగా పది పడకల లోపు ఉన్న ఆసుపత్రుల విషయంలో కొన్ని నిబంధనలు సడలించాలన్నారు. ఫైర్ ఎన్‌వోసీ రెన్యువల్ ఐదేళ్లకు ఒకసారి చేయించుకొనేలా నిబంధనలు మార్చాలని ముఖ్యమంత్రిని కోరారు. ఐఎంఏ వైద్య బృందం వివరించిన సమస్యలన్నీ శ్రద్ధగా విన్న చంద్రబాబు వాటిని పరిశీలించి, సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జీఎస్టీ శ్లాబులు 12 శాతం మించకూడదు

● పెట్రోల్, డీజిల్‌ను జీఎస్‌టీలో చేర్చాలి

● చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి


సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

గుంటూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీలో ఇకపై అమలు చేయనున్న రెండు శ్లాబులలో కూడా 12 శాతం మించకుండా చర్యలు తీసుకోవాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్విత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్‌టీలో ఇకపై నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబులే కొనసాగేలా కేంద్ర మంత్రివర్గం తీర్మానం చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయితే 5, 18 శాతం ఉంటాయని తీర్మానం చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. 12 శాతం మించకూడదని, పైగా సామాన్య ప్రజలు వినియోగించే వస్తువులను 5 శాతం శ్లాబులో చేర్చాలని కోరారు. అదే విధంగా రైతులు వినియోగించే యూరియాతో పాటు వస్తువులపై పన్ను లేకుండా మినహాయింపు కల్పించాలన్నారు. గృహ నిర్మాణాలపై కూడా ఐటీ మినహాయింపు కల్పిస్తే అత్యధిక శాతం మందికి సొంత ఇల్లు కలం సాకారం అవుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌ను జీఎస్‌టీలో చేర్చాలని తాము తొలి నుంచి డిమాండ్ చేస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతుందన్నారు. వీటిని జీఎస్టీలో చేరిస్తే.. నిత్యావసరాల ధరలు తగ్గే అవకాశం ఉంటుందని , సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూళ్ళ ఆలోచన కంటే తక్కువ పన్నుతో ఎక్కువ ఆదాయం పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చాంబర్ సభ్యులు టీఎల్‌వీ వీరాంజనేయులు, షరాబు కృష్ణమూర్తి, గొల్లపూడి కాశీరాంబాబు, తూనుగుంట్ల నాగేశ్వరరావు, ఆతుకూరి నగేష్‌కుమార్, కొత్తూరి వెంకట్ తదితరులున్నారు.

అంధుల క్రికెట్ పోటీల విజేత ఆంధ్ర గ్రీన్

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 22(ఆంధ్ర జ్యోతి): స్థానిక పిచ్చుకుల గుంట క్రికెట్ మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర అంధుల క్రికెట్ పోటీలలో ఆంధ్ర గ్రీన్ క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్, విజువల్లీ చాలెంజ్‌డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 42 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభను కనబరిచిన వారిని ఆంధ్ర ప్రదేశ్ అంధుల క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసోసియేషన్ అధ్యక్షుడు జి. రవీంద్ర బాబు విచ్చేశారు. ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరిని ప్రశంసించారు. విజేత జట్టుకు ట్రోఫీని, ప్రశంస పత్రాలను అందజేశారు. పోటీల నిర్వాహకుడు కొలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐటీసీ, ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఈ పోటీలకు సహాయ సహకారాలు అందజేశాయని అన్నారు. అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి, ఒడిశాకు చెందిన భారత అంధుల క్రికెటర్ పంకజ్ బోయి, శ్రీధర్ బాబు, పరమహంస పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

(5వ పేజీ తరువాయి)

సహా చుట్టుపక్కల ఉన్న చేనేత గ్రామాలు, చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, వరపర్ల పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ దరఖాస్తుల కోసం సచివాలయాల వద్ద బారులు తీరుతున్నారు. కాగా ఇప్పటికే మూడు జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక ఒక కొలిక్కి వచ్చింది. అర్హుల జాబితా ఇప్పటికే చేనేత, జౌళిశాఖ కార్యాలయాలకు చేరినట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 2,460 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. మంగళగిరి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువమంది షెడ్డుల్లో నేసే కార్మికులు ఉన్నారు. వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్న డిమాండు వినిపిస్తోంది. దీనిపై మంత్రి లోకేశ్ కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కాగా పల్నాడు జిల్లాలో 280 మంది మాత్రమే అర్హులుగా ఉన్నట్లు తేలింది. అయితే బాపట్ల జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 7వేల పైచిలుకే ఉండే అవకాశం కనిపిస్తోంది. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పొందినవారి సంఖ్యే 7వేల పైచిలుకు ఉంది. అయితే అట్టడుగు వర్గానికి చెందిన కార్మికులను నేతన్న నేస్తం లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదు. అలాంటివారు కూడా ఇప్పుడు ఉచిత విద్యుత్ స్కీముకు దరఖాస్తు చేసుకుంటున్నారు. వారిని కూడా కలుపుకుంటే మూడు జిల్లాల్లో ఈ సంఖ్య మరో ఐదువేల వరకూ పెరిగే అవకాశం కనిపిస్తోంది.

సర్‌చార్జి.. పెండింగ్

(5వ పేజీ తరువాయి)

అనుమతి ఇస్తే నిధులు జమవుతాయని వారు సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తుంది. ఐజీ అనుమతి ఇవ్వాలంటే ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని సమాచారం.

అప్పుల్లో కూరుకుపోతున్నాం

గ్రామ పంచాయతీలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం విడుదల చేసి ఎనిమిది నెలలు దాటింది. కానీ ఇంతవరకు గ్రామ పంచాయతీలకు జమ చేయలేదు. గ్రామాల్లో ఏ చిన్న అవసరం వున్నా అప్పు చెయ్యాల్సి వస్తుంది. పెండింగ్‌లో ఉన్న సర్‌చార్జి నిధుల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలపాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సంవత్సరం నుంచి సర్‌చార్జి రాలేదని గుంటూరు జిల్లా వెంగళాయపాలెం సర్పంచ్ నల్లపాటి లలితకుమారి తెలిపారు.

భార్యను రైలు కిందకు తోసిన భర్త

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను భర్త రైలు కిందకు తోసిన ఘటన..తాడేపల్లి పట్టణంలో శుక్ర వారం జరిగింది. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన వెంకటేశ్వరరావు, భార్య అంజలి తాడేపల్లిలో నివాసం ఉంటున్నారు. రైల్వే ట్రాక్ వద్ద ఇద్దరూ గొడవ పడుతున్న సమయంలో అంజలిని రైలు కిందకు తోసేశాడు. స్థానికులు గాయాల పాలైన ఆమెను కాపాడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావును రైల్వే పోలీసులకు అప్పగించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు

● అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ డాక్టర్ సుబ్బారావు పావులూరి



మాట్లాడుతున్న సుబ్బారావు

గుంటూరు (విద్య)ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి): కొత్త ఆవి ష్కరణలు, ఉపగ్రహ ప్రాజెక్టులు, పరిశోధనలు ఇవన్నీ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిస్తాయని హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బా రావు పావులూరి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని టీమ్ సీవోఈ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలను స్మరించుకోవడమే కాకుండా, భవిష్యత్తు తరం శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చే రోజు జాతీయ అంతరిక్ష దినోత్సవమని పేర్కొన్నారు. 2023 ఆగస్టు 23న చంద్రయాన్3 మిషన్ ల్యాండర్ విక్రం చంద్రుడి ఉపరితలాన్ని తాకిన చారిత్రక సందర్భాన్ని గుర్తుగా చేసుకుంటూ, ఈ రోజును అధికారికంగా జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారని వెల్లడించారు. విజ్ఞాన్స్ వర్సిటీలో జరిగిన నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌స్పేస్ టెక్ అకాడమీ (ఏపీఎస్‌ఏ)ను ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి నూతన అధ్యక్షుడిగా అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు ఎంపికయ్యారు. గౌరవ అతిథి శ్రీహరికోటలోని మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.శేషగిరి రావు, హైదరాబాద్ జేఎన్‌టీయూ మాజీ డైరెక్టర్ ఐ.వీ.మురళీకృష్ణ, ఏఎస్‌టీసీ సెక్రటరీ సి.ఎల్. నరసింహారావు, విట్ ప్రొఫెసర్ ఇ.శ్రీనివాస రెడ్డి, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శనగ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న శేషుమాధవ్

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ ఎగ్రికల్చర్(నిర్కా) ఆధ్వర్యంలో చిన్న, సన్నకారు రైతులకు శనగ విత్తనాలను అధికారులు పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం మిర్చియార్డు ఎదురుగా ఉన్న ఎన్‌ఐఆర్‌సీఏ(పూర్వ సీటీఆర్‌ఐ) ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిర్కా రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సీ సబ్‌ప్లాన్ కింద చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు కేంద్రం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఒక్కో మహిళ రైతుకు 20 కేజీల శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ విత్తనాలను పొలాల్లో నాటుకొని మంచి లాభాగా గడించాలని ఆకాంక్షించారు. మొత్తం 55 మంది మహిళ రైతులకు శనగలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్కా గుంటూరు స్టేషన్ హెడ్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, అధికారులు జయకృష్ణా, సుబ్బారావు, దీపక్, ఏసు, గోవిందరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నరేంద్రవర్మను సన్మానిస్తున్న జనసేన నాయకులు విన్నకోట సురేష్, గుంటుపల్లి తులసీకుమారి తదితరులు

గుంటుపల్లి నియామకంపై జనసైనికుల హర్షం

● ఎమ్మెల్యే వేగేశనను సన్మానించిన నాయకులు

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎంతోకాలం తర్వాత బాపట్ల తూర్పుసత్రం ఛైర్మన్‌గా జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారిని నియమించటంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను శుక్రవారం రాత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తూర్పుసత్రం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు విన్నకోట సురేష్, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, జనసేన నాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, కారుమూరి అంజనేష్, సాయి, సుజిత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీకి మొక్క అందజేసిన ఎస్పీ



బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆర్టీసీ డిపోను సందర్శించేందుకు శుక్రవారం విచ్చేసిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును ఎస్పీ తుషార్‌డూడి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ డిపో వద్ద తిరుమలరావుకు ఎస్పీ మొక్క అందజేశారు.

ఆటోనగర్ బాధితులకు న్యాయం చేయాలి

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చీరాల మండలం ఈపూరుపాలెం దగ్గర ఏర్పాటు చేయనున్న ఆటోనగర్ వల్ల అనేక గిరిజన కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్‌లో గిరిజన కమిటీ నాయకులు కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం ద్వారా వివరించారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని పరిశీలించి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రెండురోజుల్లో జేసీ ద్వారా విచారణ జరిపించి తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ నాయకులు భోగిరి రామారావు, భోగిరి పృధ్వీరాజు, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, గిరిజననాయకులు కర్రెద్దుల సురేష్ తదితరులు ఉన్నారు.

● వైద్యుల నిర్లక్ష్యంతో దివ్యాంగులకు పెన్షన్‌లు రాకుండా ఇబ్బందులు పడుతున్నారని బావపురి దివ్యాంగుల సేవాసమితి రాష్ట్రఅధ్యక్షులు, జనసేనపార్టీనాయకుడు గోగన ఆదిశేషు పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్ జె.వెంకటమురళికి దివ్యాంగులతో కలిసి వెళ్ళి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటినుంచో పెన్షన్ తీసుకుంటున్న దివ్యాంగులు రీవెరిఫికేన్ వల్ల జిల్లాలో సుమారు 3వేలకు మందికిపైగా పెన్షన్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని కలెక్టర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాటసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాసరెడ్డి, గాలి ముట్టి కిరణ్, కంది వెంకటరెడ్డి, మౌలాలి, జానీబాషా, రామరెడ్డి, జోసఫ్, రవి, శ్రీనివాసరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించటానికి చర్యలు

● కలెక్టర్ జె.వెంకటమురళి

● కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సమస్యలు పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీరి కోసం ప్రత్యేకగ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెరిఫికేషన్‌లో తొలిగించిన దివ్యాంగ పించన్‌దారులకు మరొక అవకాశం కల్పిస్తామన్నారు. విభిన్న ప్రతిభావంతుల పెన్షన్‌ల కోసం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌ల దగ్గరకెళ్ళి అప్పీల్ చేసుకోవాలన్నారు. విభిన్నప్రతిభావంతులకు తిరిగి వెరిఫికేషన్ ద్వారా పింఛన్ మంజూరయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన దివ్యాంగులు

దివ్యాంగుల సర్వేతో అర్హులకు అన్యాయం

● నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు బసవయ్య



మాట్లాడుతున్న బసవయ్య

వేమూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన దివ్యాంగుల పెన్షన్ సర్వే ద్వారా అర్హులైన వారందరికి అన్యాయం జరిగిందని చేయూత దివ్యాంగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దాసరి బసవయ్య ఆవేదన వ్యక్తపరిచారు. వేమూరులో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, గ్రామాల స్థాయిలో ప్రభుత్వం గతంలో మంజూరైన పెన్షన్లపై సర్వే నిర్వహించిందని ఈ సర్వే ద్వారా ప్రభుత్వ సర్టిఫికెట్లు పొందిన వారందరికి తిరిగి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వీటి నిర్వహణలో ఎక్కువ శాతం ఆర్థో, న్యూరాలజీకి సంబంధించిన లబ్ధిదారులు ఉంటారు కానీ అందరికి పరీక్షలు చేసేందుకు డాక్టర్లు ఏర్పాటు చేశారని తద్వారా చాలా మందికి పింఛన్లు కోల్పోయే విధంగా దివ్యాంగ శాతాన్ని పూర్తిగా తగ్గించారని ఆవేదన వ్యక్తపరిచారు. మండల స్థాయిలోనే ప్రాథమిక కేంద్రాల వద్దనే పరీక్షలు నిర్వహించి అర్హులైన వారందరికి తిరిగి పింఛన్లు అందే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన కోరారు.

దివ్యాంగులందరికీ పెన్షన్ కొనసాగించాలి

● వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులందరికి పెన్షన్‌లు కొనసాగించాలని వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం దివ్యాంగులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చల్లా రామయ్య మాట్లాడుతూ జిల్లాలో 3,829 మంది అర్హులైన దివ్యాంగులకు నోటీసులిచ్చి సంతకాలు పెట్టించుకొని పెన్షన్‌లు రావని సచివాలయ ఉద్యోగులు చెప్పటం దారుణమన్నారు. అధికారులు స్పందించి దివ్యాంగులకు న్యాయం చేయాలని పెన్షన్‌లు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.

లిక్కర్ స్కాంను కట్టుకథ అనటం నీచరాజకీయం : కొల్లా

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ కేసు పూర్తిగా కల్పితమని జైలులో ఉన్న ఎంపీ మిథన్‌రెడ్డితో ములాఖత్ అనంతరం రాజమహేంద్రవరంలో వైసీపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడటం నిజాలకు పాతర వేసి చంద్రబాబు పాలనపై బురద చల్లే నీచ ప్రచారమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈస్కాంలో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు ఉన్న కొన్ని వందల మందిని గుగూల్ టేకవుట్ వంటి సాంకేతిక ఆధారాలతో సహా విచారించి కోట్ల రూపాయల నల్ల ధనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులు అనేకమందితో నిజాలు కక్కించి అరెస్ట్ చేసినా బొత్సా దీనిని కల్పిత కథగా అభివర్ణించటం వైసీపీ నీచరాజకీయాలకు నిదర్శనమని కొల్లా పేర్కొన్నారు.

జిల్లాలో సమృద్ధిగా ఎరువులు, పురుగుమందులు

● వ్యవసాయ మంత్రి, సీఎస్‌లకు వివరించిన కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి తదితరులు

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎరువులు, పురుగుమందులు సమృద్ధిగా ఉన్నాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎరువులు, పురుగుమందుల విక్రయాలపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర చీఫ్ సెక్రటరి విజయానంద్ కలిసి అమరావతి నుంచి కలెక్టర్‌లతో శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ఎరువుల కృత్రిమ కొరత లేకుండా చూడాలని, అక్రమ నిల్వలు, విక్రయాలు అరికట్టాలని తెలిపారు. బాపట్ల జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ జె.వెంకటమురళి వీక్షణ సమావేశం అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 76వేల హెక్టార్‌లలో పంటలసాగు ప్రారంభమైందన్నారు. ప్రతిఏట ఆగస్టులో చేపట్టే సాగు కంటే అదనంగా 22,898 హెక్టార్లలో పంట వేశారని తెలిపారు. మెట్ట ప్రాంతాలలో సైతం సాగు మొదలైందని వివరించారు. 575 మెట్రిక్ టన్నుల ఎరువులు, పురుగుమందులు ఉన్నాయని రైతు సేవాకేంద్రాలలో ఉంచామని చెప్పారు. ఐఎఫ్ఎంఎస్‌లో నమోదు చేయకపోయినప్పటికి రైతుల అవసరార్థం ముందుగానే విత్తనాలు, ఎరువులను రైతులకు పంపిణి చేశామన్నారు. ప్రైవేట్ దుకాణాలలోను సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించటానికి వ్యాపారులు ప్రయత్నిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైనన్ని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అన్ని గ్రామాలలో సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తహసీల్దార్, మండల వ్యవసాయశాఖాధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్‌లను కమిటీగా నియమిస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీ గ్రామాలలో పర్యటిస్తుందన్నారు. అక్రమ నిల్వలు, అక్రమ వ్యాపారాలపై పరిశీలన చేస్తుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేలో వేగం పెంచాలి : కలెక్టర్

స్వామిత్వ సర్వేలో వేగం పెంచి త్వరగా హక్కు పత్రాలు అందజేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ విషయమై శుక్రవారం అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో డ్రోన్‌సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. సర్వేలో తలెత్తే వివాదాలు, అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రజలకు తమ ఆస్తులపై స్పష్టమైన హక్కులు లభిస్తాయని తద్వారా వారు బ్యాంక్‌ల నుంచి సులభంగా రుణాలు పొందవచ్చు అని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ కనక ప్రసాద్, ఆర్డీవో పి.గ్లోరియా, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, డీపీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులు తగదు : సీఐటీయూ

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు వైద్యసేవలందించే ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులు, కక్ష సాధింపు చర్యలు తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. రెండు దశాబ్దాలుగా అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఆశావర్కర్‌గా పనిచేస్తున్న మద్దిబోయిన వెంకాయమ్మను రాజకీయ నాయకులతోపాటు అధికారులు వేధింపులకు గురి చేస్తూ పదేపదే షోకాజ్ నోటీసులిచ్చి హింసకు గురిచేస్తున్నారని జిల్లావైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయం ఎదుట ఆశావర్కర్లతో కలిసి శుక్రవారం ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆశావర్కర్లను రాజకీయ కక్ష సాధింపు చర్యలతో అధికారులు వేధిస్తే ఊరుకునేది లేదన్నారు. ఆశావర్కర్లకు సీఐటీయూ అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు వి.వెంకటేశ్వరమ్మ, కృష్ణవేణి, రాహేల్, మహాలక్ష్మి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

ఎంపీడీవోలు, ఉప ఎంపీడీవోలకు శిక్షణ

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని పంచాయతీ ప్రగతి సూచిక వర్క్‌షాపులో శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపమండల పరిషత్ అభివృద్ధి అధికారులకు పీఏఐ 1.0 యాప్‌పై శిక్షణనిచ్చారు. గ్రామసచివాలయాలలో శాఖల మధ్య సమన్వయ, సమాచార రూపం వలన గ్రామపంచాయతీకి చెందిన వాస్తవ ప్రగతి పురోగతి ఆవెబ్ సైట్‌లో నమోదు చేయకపోవటం వల్ల జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన గ్రామపంచాయతీలు సాధించిన ప్రగతికి గుర్తింపు రావటంలేదని జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకర్ తెలిపారు. అందువలన జిల్లా స్థాయిలో వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సఖీవన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బాధిత మహిళలు సఖీవన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకొని న్యాయపరమైన, చట్టపరమైన సేవలు, కౌన్సెలింగ్, వైద్యం వంటి సేవలు పొందవచ్చు అని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. పట్టణంలోని ఉప్పరపాలెం రైల్వేగేటు వద్ద ఉన్న సఖీవన్‌స్టాప్ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలకు మెరుగైన సేవలందించేందుకు సఖీవన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు అందించే సేవలు గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి పలుసూచనలు చేశారు. బాలికలు, మహిళలు ఏదైనా సమస్య ఉంటే తక్షణ సహాయం సఖీవన్‌స్టాప్ సెంటర్ ద్వారా పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ నారాయణ, మహిళా పీఎస్ సీఐ శ్రీనివాసరావు, పట్టణ సీఐ ఆర్.రాంబాబు, సఖీవన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



సఖీవన్‌స్టాప్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు జరపాలి

రేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం బార్ అండ్ రెస్టారెంట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు అన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన బార్ పాలసీ, రెస్టారెంట్ బార్‌ల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ అనుసరించి స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏ4 షాపు నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారమే బార్ అండ్ రెస్టారెంట్‌లు నిర్వహించాలని తెలిపారు. బార్ అండ్ రెస్టారెంట్‌లు లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి గల వారు బార్ అండ్ రెస్టారెంట్‌ల కొరకు అప్లికేషన్‌లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, బార్ అండ్ రెస్టారెంట్‌ల ఓనర్లు పాల్గొన్నారు.

మూడో విడత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐలో మిగిలి ఉన్న సీట్లకు మూడవ విడత ప్రవేశానికి రెండు సంవత్సరాల కోర్సులు ఎలక్ట్రికల్, మెకానికల్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఒక సంవత్సరం కోర్స్ మెకానిక్ డీసెల్ సీట్లకు దరఖాస్తులను ఐటీఐ.ఏపి.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26వ తేది వరకు నమోదు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ ఆర్.శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కొరకు 7702400570, 9398650408 నంబర్లను సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 28వ తేదీన అడ్మిషన్లు గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించబడతాయని తెలిపారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయుడు కొడాలి లక్ష్మీకాంతరావు అభ్యర్థన మేరకు గుంటూరుకు చెందిన భవానీ ఎలక్ట్రికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ నల్లూరి నాగేశ్వరరావు మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న మూడు ప్రభుత్వ పాఠశాలలు, భట్టిప్రోలులో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఎంఈవో దేవరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, వి.సురేష్‌కుమార్, షణ్ముయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరు

చుండూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ గల పార్టీ అని రాష్ట్ర తెలుగు రైతు మాజీ కార్యదర్శి వీఎస్‌కె ప్రసాద్ అన్నారు. చుండూరులో శుక్రవారం జరిగిన మండల పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ నాయకత్వం వలన రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ఉండి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తమ్మా శివారెడ్డి, బాలకోటిరెడ్డి, ఎల్లారెడ్డి, భీమవరపు శ్రీమాన్, కావూరి శ్రీనివాసరావు, దేవిరెడ్డి నాగేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ శాంతకుమారి తెలిపారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అమరవర్ధన్ తెలిపారు. శుక్రవారం 112 కాల్ ద్వారా కొల్లూరు పోలీస్‌స్టేషన్‌కు మండల పరిధిలోని ఈపూరు గ్రామ శివారులో జూద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో పేకాట శిబిరంపై ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినాయకచవితి పందిళ్ళకు అనుమతి తప్పనిసరి : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఆవులశ్రీనివాసరావు

రేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పందిళ్ళకు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. రేపల్లె డివిజన్ పరిధిలోని వేమూరు, రేపల్లె పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి పండుగను నిర్వహించే కమిటిలు ముందస్తుగానే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కమిటీల వారు వినాయకచవితి పందిళ్ళు ఎక్కడ ఏర్పాటు చేసే విషయం, నిమజ్జనం చేసే స్థలం, తప్పనిసరిగా జత చేసి పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ ప్రదేశాలలో మండపాలు, పందిళ్ళు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించుకునే వారు సులభంగా అనుమతులు పొందేందుకు సింగిల్ విండో విధానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిందని మెరుగైన సేవలు అందించేందుకు హెచ్‌టిటిపిఎస్..గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌ను పోలీస్ శాఖ ప్రారంభించిందని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మండపాల నిర్వాహకులు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు.

● కర్లపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునేవారు ముందుగా పోలీసు, రెవెన్యూ, విద్యుత్‌శాఖాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కర్లపాలెం మండల ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఎస్ఐ శుక్రవారం మాట్లాడుతూ మండపాలలో డీజే సౌండ్ సిస్టం రాత్రి 10 గంటల తర్వాత వినియోగించరాదని, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొనుటకు మండపం కమిటీ మెంబర్స్ పోలీసు వారి పర్మిషన్ కోసం పోలీస్ యాప్‌లో నమోదు చేసుకుంటే సరైనపత్రాలు ఉంటే అందులోనే పర్మిషన్ కూడా జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు పొందాలని ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ఏర్పాట్ల కోసం తప్పనిసరిగా పోలీసు శాఖ ప్రవేశ పెట్టిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఉత్సవాలు జరుపుకునే వివరాలు, నిమజ్జన తేదీలతో సహా దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు.

● అమృతలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహం ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని ఎస్ఐ కె రవితేజ తెలిపారు. ఉత్సవ కమిటీ ఆన్‌లైన్‌లో విద్యుత్‌శాఖ, మైక్ అనుమతి కోరుతూ చలానా, విగ్రహ ఏర్పాటు స్థలం, నిమజ్జన ఊరేగింపు రూట్ మ్యాప్‌తో తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

● జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు

కొల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పాటు వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. కొల్లూరు మండలంలోని పెసర్లంక గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు బహుళ పంటల సాగు, వ్యవసాయ సాంకేతికత, ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా వ్యవసాయాధికారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాల్సిన అవశ్యకత ఉందన్నారు. పంటల్లో చీడపీడల నివారణకు పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా తయారు చేసే వివిధ కషాయాల వినియోగంతో చీడపీడలు నివారించుకోవచ్చన్నారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంలో ప్రీమాన్‌సూన్ డైసోయింగ్ సాగుపై ప్రతి ఒక్క రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్ వివిధ రకాలైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ గురించి రైతులకు వివరించారు. రేపల్లె ఏడీఏ అద్దేపల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ మధుసూదన ప్రసాద్, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, క్రాప పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరిప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

లాయర్స్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

రేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ లాయర్స్ అసోసియేషన్స్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీనియర్ న్యాయవాది దారం సాంబశివరావు కోరారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సదస్సు జయప్రదం చేయాలంటూ గోడపత్రికలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30, 31 తేదీల్లో గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగనున్న ఇండియన్ అసోసియేషన్ రాష్ట్రసదస్సులను న్యాయవాదులు ప్రజాసంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దోవ రమేష్‌రాంజీ, దాసరి శ్రీవల్లి, కె.మేరీ, కె.ప్రతాప్, జమీర్, ఎం.సుబ్బయ్య, పి.నాగాంజనేయులు, నాగరాజు, భూషణం, రాంబాబు, ఫణికుమార్, గోపిరాజు, క్రాంతి పాల్గొన్నారు.



సదస్సును జయప్రదం చేయాలని గోడపత్రికలను విడుదల చేస్తున్న న్యాయవాదులు

సేవకు మారుపేరు చిరంజీవి

● జనసేన నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సేవకు నూతన ఒరవడి తీసుకొచ్చి బ్లడ్ బ్యాంక్, ఐబ్యాంక్, ఆక్సిజన్ సిలెండర్స్ ద్వారా ప్రముఖ సినీనటుడు డాక్టర్ కె.చిరంజీవి విస్తృత సేవలందించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని జనసేననాయకుడు, అఖండఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తెలిపారు. చిరంజీవి జన్మదిన వేడుకలను వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి బధిరుల విద్యార్థులకు తినిపించారు. అనంతరం విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుమొలకల చంద్రమోహన్,గొట్టిపాటి శ్రీకృష్ణ, కారుమూరి అంజనేష్, కామిశెట్టి సాయిబాబు, పసుపులేటి మహేష్, కత్తి నాగలక్ష్మి పాల్గొన్నారు.



చిరంజీవి జన్మదిన కేక్‌ను కట్ చేసి చిన్నారులకు తినిపిస్తున్న జనసేన నాయకుడు విన్నకోట సురేష్ తదితరులు

సేవాభావం కలిగిన వ్యక్తి చిరంజీవి

రేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సినీరంగంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని అగ్ర హీరోగా నిలబడి పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో నేత్రదానం, రక్తదానం ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించారని టీడీపీ సీనియర్ నాయకుడు వడ్డి లక్ష్మోజీ అన్నారు. మండలంలోని వడ్డివారిపాలెంలో శుక్రవారం పాలంకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు శ్రీనివాసరావు, ఆళ్ళ సూరిబాబు, గుడిపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

కూచినపూడిలో...

చిరంజీవి అభిమాని తోట వెంకటరామారావు ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని నిజాంపట్నం మండలం కూచినపూడిలో కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టె, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్, కె.జగదీష్, కె.నాగేశ్వరరావు, కె.అనిల్, పి.శ్యామ్, ఎన్.రాజశేఖర్, ఎ.పున్నారావు, కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి చిరంజీవి యువత చేయూత

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీనటుడు డాక్టర్ కొణిదల చిరంజీవి బాపట్లలో చదువుకునే సమయంలో ఇష్టదైవంగా శ్రీ సువర్చలసమేత ప్రపత్యాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించే వారని చిరంజీవి యువత ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు విష్ణుమొలకల చంద్రమోహన్ అన్నారు. అంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు ఆయన జన్మదినం సందర్భంగా రూ.25 వేల విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కమిటీ సభ్యులకు డబ్బులు అందజేశారు. అభిమానులు పడమటి ధర్మారావు, కొలను మోహన్‌కుమార్, తిమ్మన శేషు, కంచర్లపల్లి నరేంద్ర, చిరంజీవుల లక్ష్మణ్, దేవాలయం కమిటీ సభ్యులు పాపినేని ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల సమావేశం

కొల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల సమావేశం శనివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. స్థానిక ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

స్త్రీ యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్లపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ యోగ శిక్షకుల అభ్యర్థుల నియమకానికి అర్హత ఉన్న, ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని యునాని వైద్యశాల డాక్టర్ ఎస్.రోషన్ జహనా ఆరా అన్నారు. యోగాలో పీజీ డిప్లమా లేదా డిగ్రీ చేసిన అనుభవం, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు తమ యోగా సర్టిఫికెట్స్‌తో సెప్టెంబరు 8వ తేదీన ఆయుష్ ఆరోగ్య మందిరం ప్రభుత్వ యునాని వైద్యశాల బుద్ధాంలో హాజరుకావాలని కోరారు.

స్ఫూర్తి పొందిన ఆచరణకు..అంతర్జాతీయ ఖ్యాతి!

- రాష్ట్ర సచివాలయాన్ని తలపించేలా..హంగులు
- తెనాలి తహసీల్దారు కార్యాలయం ఆధునికీకరణ
- హెల్ప్ డెస్క్, వెయిటింగ్ హాల్..పచ్చదనంతో ఆహ్లాదం
- సేవలు, పనులను పరిశీలించిన ఐఎస్ఓ బృందం


నూతన నేమ్ బోర్డుతో తహసీల్దారు కార్యాలయం ముఖద్వారం

తెనాలి, తెనాలి అర్బన్, ఆగస్టు 22,(ఆంధ్రజ్యోతి): ఎప్పుడో 143 ఏళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనం. వలస పాలకుల ప్రభుత్వంలో ప్రధాన అధికారిక కార్యాలయం. 1882లో కొండరాళ్లతో కట్టిన గోడలు, పెంకులతో పైకప్పు.. చిన్నపాటి మరమ్మతులు మినహా ఇప్పటి వరకు ఆ భవనానికి పెద్దగా మార్పులు చేసింది లేదు. తెనాలి తాలూకా పేరుతో ఉన్న ఏక భవనంలోనిదే ఈ తహసీల్దార్ కార్యాలయం. ఆవరణంతా చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, మద్యం సీసాలతో నిండిపోయింది. రక్షణ లేక అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. ఇదంతా.. నాలుగు నెలల క్రితం. కానీ, ఇప్పుడు అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన హంగులను సంతరించుకుని.. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండార్డ్స్(ఐఎస్ఓ) సర్టిఫికెట్ పొందేందుకు సిద్ధమైంది. ఇదంతా సాధ్యమైంది.. ఇక్కడికొచ్చిన ఒక తహసీల్దారు చొరవ, ఒక దాత స్పందన కారణం.

ముఖ్యమంత్రి మాటే స్ఫూర్తిగా..

గతంలో చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ కార్యాలయాలన్నీ పరిశుభ్రంగా ఉంచి, ప్రజలకు సేవలు సకాలంలో అందించాలనే సూచనలను తెనాలికి తహసీల్దార్ గోపాలకృష్ణ స్ఫూర్తి పొందారు. ఈయన తెనాలి మండలానికి రాక ముందు బాపట్ల, చేబ్రోలు, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో పనిచేశారు. అక్కడి కార్యాలయాల సుందరీకరణ, ఆవరణలో పరిశుభ్రత చేపట్టారు. అలాగే అత్యంత విలువైన రికార్డులను భద్రపరిచే పనులు చేపట్టారు. దీనిని ఆయన ఒక అలవాటుగా మార్చుకున్నారు. సంవత్సరం క్రితం తెనాలికి బదిలీపై తహసీల్దార్‌గా వచ్చిన తర్వాత కార్యాలయ ఆవరణ చెత్తతో నిండిపోవటం, కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరటంతో వాటిని బాగు చేసే పనికి ఆయన శ్రీకారం చుట్టారు.

స్పందించిన దాత

ఇక్కడ రెవెన్యూ, విశ్రాంత ఉద్యోగుల భవనం పడిపోయి, చెత్త కుప్పలా మారటంతో దానిని పూర్తిగా తొలగించి, మొత్తం శుభ్రపరిచారు. దీనిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో.. దానికి ఆకర్షితుడైన తెనాలికే చెందిన సూర్యదేవర భువన్‌కుమార్ స్పందించారు. కొత్త భవనం నిర్మించేందుకు సహకారం అందిస్తానని ముందుకొచ్చారు. ఆయనే దగ్గరుండి ఆధునికీకరణ పనులను చేయిస్తున్నారు. తాను ప్రచారం పొందడానికి ఇదంతా చేయడం లేదుని, తహసీల్దార్ పనితీరునచ్చి.. ఆయన ఆలోచనలకు అనుగుణంగా కార్యాలయ అవరణను తీర్చిదిద్దటానికి ముందుకు వచ్చానని స్పష్టం చేశారు. కొత్త బోర్‌వేసి తాగునీటి సదుపాయం కల్పించామన్నారు. భవనం పైకప్పు పెంకులతో సరిచేయాల్సి ఉందని, దీనికి భారీ ఖర్చుతోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి పనివారిని తీసుకొచ్చి చేయించాల్సి ఉందన్నారు.

ఆధునిక హంగులు..

రేకులతో పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌ను కార్యాలయానికి వచ్చే ప్రజలు వేచి ఉండేందుకు.. గదిగా మార్చారు. వసతుల ఏర్పాటుతో పాటు.. తల్లులు పిల్లలకు పాలివ్వడానికి ప్రత్యేక ఫీడింగ్ రూమ్‌ను తీర్చిదిద్దారు. కార్యాలయానికి ప్రహరీ నిర్మించారు. పెద్ద ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి, కార్యాలయానికి ఎదురున్న ఖాళీ స్థలంలో గార్డెన్ తీర్చిదిద్దారు. దాని మధ్యలో నాలుగు సింహాల విగ్రహం, చుట్టూ వాటర్ ఫౌంటేన్, గోడలపై అందంగా మొక్కల ఏర్పాటు చేశారు. జెండా వందనానికి వీలుగా.. స్టీల్ పైపుతో దిమ్మెనూ ఏర్పాటు చేశారు. ప్రాంగణం మొత్తం పాలిష్ రాళ్లతో ఫ్లోర్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక పార్కింగ్, ఆధునిక టాయిలెట్స్ కల్పించారు. ఆవరణలో వర్షపాతం కొలిచే యూనిట్ సుందరంగా తీర్చిదిద్దారు. ఐటీ ఉద్యోగులు ఇక్కడికి వస్తే.. ల్యాప్‌టాప్ పెట్టుకుని వర్క్ కూడా చేసుకునే విధంగా సౌకర్యం కల్పించారు. కార్యాలయం ముఖద్వారంలో భారీగా నేమ్ బోర్డును ఏర్పాటు చేశారు. గ్రానైట్ పలకలపై స్టీల్ అక్షరాలతో తీర్చిదిద్దటం ఆకర్షణగా నిలిచింది. దీంతో స్థానికులు ఇక్కడికి వచ్చి సెల్ఫీలు దిగుతున్నారు.

ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు సంసిద్ధత

తాలూకా సముదాయం మొత్తం 3.87 ఎకరాలు. కాలక్రమంలో మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి వచ్చాయి. ఇప్పుడు ఆధునిక హంగులను అద్దుకున్న తహసీల్దారు కార్యాలయాన్ని తాజాగా 15 మందితో కూడిన ఐఎస్ఓ బృందం సందర్శించింది. పరిసరాలను, ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను, సేవలను, సిటిజన్ చార్ట్ అమలు తీరును పరిశీలించింది. కార్యాలయానికి వచ్చిన ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఐఎస్ఓ ప్రమాణాలకు తగ్గట్టుగా కార్యాలయం ఉండటంతో.. చిన్నపాటి మార్పులు, సదుపాయాల వంటివి సమకూర్చే విషయంలో సూచనలు చేసి వెళ్లారు. అవన్నీ సరిచేయించడంతో.. శుక్రవరం పరిశీలించిన ఐఎస్ఓ ప్రతినిధులు త్వరలో సర్టిఫికెట్ ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ వెల్లడించారు.

చివరి దశలో ప్రక్రియ

నాణ్యత, భద్రత, ఇతర సేవా పరమైన అంశాలకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ఒక నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించడమే కాకుండా.. వాటి ప్రమాణాల తీరును ఐఎస్ఓ నిర్ధారిస్తుంది. ఇతర రంగాల్లో సేవల తీరును కూడా. దీని కోసం అంతర్జాతీయంగా నిపుణుల బృందం ఎప్పటికప్పుడు ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తారు. ఒక ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో అందించాల్సిన సేవలు, వసతుల కల్పనలోనూ ఐఎస్ఓ విధివిధానాలు రూపొందిస్తుంది. అటువంటి అంతర్జాతీయ ప్రమాణాలుంటే.. ఆ సంస్థలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. దీనికోసం ప్రజాభిప్రాయ సేకరణ, ముసాయిదా ప్రకటన వంటివి ఉంటాయి. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం విషయంలో ఆ ప్రక్రియ చివరి దశలో ఉంది.

సీఎం మాటలే ఆదర్శంగా: గోపాలకృష్ణ, తహసీల్దారు

మన ఇంటినే కాకుండా మనం పనిచేసే కార్యాలయాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని గతంలో ముఖ్యంత్రి చంద్రబాబు చెప్పిన మాటలు నాలో స్ఫూర్తి నింపాయి. తెనాలి వచ్చాక రాష్ట్ర మంత్రి మనోహర్ ప్రోత్సాహం నాలో ఉత్సాహం నింపింది. సిబ్బంది సహకారం, దాతల తోడ్పాటు ఉండటంతో ఇదంతా చేయగలిగాం. మా శ్రమకు తగ్గట్టుగా ఐఎస్ఓ సర్టిఫికెట్ కూడా దక్కనుండటం మరింత సంతోషాన్ని కలిగించింది. వ్యవస్థ శాశ్వతం అన్నదే నా ఆలోచన.


ప్రాంగణంలో పచ్చదనంతో సుందరీకరణ


పాలిష్ రాళ్లతో ఫ్లోరింగ్


జనం వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన గది


కొత్తగా నిర్మించిన భవనం లోపలి భాగం


ఆవరణలో నాలుగు సింహాల విగ్రహం

అర్బన్ హెల్త్ సెంటర్లకు నిధులు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అర్బన్ హెల్త్ సెంటర్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గుంటూరు నగరంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీకి, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని మానుకొండవారిపాలెం, మాచర్లలోని జెండా చెట్టు పాత పట్టణం యూపీహెచ్‌సీకి రూ. కోటి వంతున నిధులు మంజూరు చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

9న భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు సెప్టెంబరు 9న బాబా బైద్యనాథ్ ధామ్‌తో అయోధ్య - కాశీ పుణ్యక్షేత్ర యాత్ర కోసం బయలు దేరుతుందని ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరీ జగన్నాథస్వామి, కోణార్క్ సూర్య భగవానుడు, దేవగఢ్‌లోని బాబా బైద్యనాథ్, వారణాసిలో కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి, అన్నపూర్ణదేవి ఆలయాలతో పాటు గంగా హారతి, అయోధ్యలో రామజన్మభూమి, హనుమాన్ గర్హి, ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం సందర్శన ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం 9701360701 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

సంతృప్తికర పరిహారానికి కృషి

- 167ఏ జాతీయ రహదారికి భూములిచ్చిన రైతులతో సమావేశం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం 167ఏ జాతీయ రహదారి నరసరావుపపేట బైపాస్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులతో కలెక్టర్ పి. అరుణ్‌బాబు సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణం విషయంలో సానుకూలంగా ఉంటూ భూములు ఇచ్చిన రైతులకు చట్ట పరిధిలో సంతృప్తకరమైన పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఆర్డీవో మధులత పాల్గొన్నారు.

ఇచ్చారు.. తీసేశారు

- శావల్యాపురం - రొంపిచర్ల మార్గంలో నెలాఖరు వరకే రైలు సర్వీసులు
- వచ్చే నెల నుంచి నాందేడ్-ధర్మవరం-నాందేడ్ రైళ్ల మళ్లింపు
- రైల్వే మంత్రికి నివేదించాలని ఎంపీకి ట్విట్టర్‌లో ప్రయాణికుల పోస్టులు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలు మార్గంలో భాగంగా ఇప్పటి వరకు పూర్తి అయిన పిడుగురాళ్ల - శావల్యాపురం సెక్షన్‌లో ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలు సర్వీసుని రైల్వే శాఖ ఎలాంటి ప్రకటన లేకుండానే ఈ నెలాఖరుతో నిలిపివేయనుంది. ఈ నూతన రైలు మార్గంలో నాందేడ్ - ధర్మవరం - నాందేడ్ ప్రత్యేక రైలు సర్వీసులను రైల్వే శాఖ తీసుకొచ్చింది. అయితే ఏ కారణం చేతనో సెప్టెంబరు మొదటి వారం నుంచి ఈ రెండు రైళ్లను కరీంనగర్ మార్గంలో మళ్లించింది. ఇప్పటికే 07189 నాందేడ్ - ధర్మవరం(ప్రతీ శుక్రవారం), 07190 ధర్మవరం - నాందేడ్(ప్రతి ఆదివారం) రైళ్లను కరీంనగర్, వరంగల్, విజయవాడ, తిరుపతి మార్గంలో మళ్లించి టైం టేబుల్‌ని అప్‌డేట్ చేసింది. దీంతో రొంపిచర్ల, శావల్యాపురం, వినుకొండ తదితర ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

ఎంపీకి సామాజిక మాధ్యమంలో వినతి

పల్నాడు ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైలు మార్గంలో రైల్వే శాఖ రైలు సర్వీసుని ఇచ్చినట్లే ఇచ్చి నిలిపేయడంపై ప్రయాణికులు ఆగ్రహంగా ఉన్నారు. ఈ మార్గంలో ప్రవేశపెట్టిన రైళ్లు అర్ధరాత్రి దాటిన తర్వాత వస్తున్నా.. తాము ఆదరిస్తున్నామని, అయినా ప్రత్యేక రైలు సర్వీసులు నిలిపేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రయాణికులు ఎక్స్ సామాజిక మాధ్యమం ద్వారా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు తమ ఆవేదనని వెలిబుచ్చారు. తక్షణమే రైల్వేబోర్డు చైర్మన్, రైల్వే మంత్రితో మాట్లాడి నాందేడ్ - ధర్మవరం - నాందేడ్ రైళ్లను సెప్టెంబరు నుంచి శావల్యాపురం, రొంపిచర్ల మీదగా పునరుద్ధరించాలని కోరారు. వేరే రూట్లలో కొన్ని రైళ్లకు ఎలాంటి ఆదరణ లేకపోయినా నడుపుతున్న రైల్వే శాఖ ఈ నూతన రైలు మార్గంలో రైలు సర్వీసుని ఆపేయడం సమంజసం కాదంటున్నారు.

- కాగా వినుకొండ - నడికుడి మధ్యన ఒక షటిల్ సర్వీసుని కూడా ప్రవేశపెట్టాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. దీని వల్ల వినుకొండ, శావల్యాపురం, రొంపిచర్ల, పిడుగురాళ్ల, నడికుడి మధ్యన ప్రయాణికులకు మేలు జరుగుతుందని సూచిస్తున్నారు.

- అలానే కాచీగూడ - మిర్యాలగూడ మెమూ రైలుని వినుకొండ వరకు పొడిగిస్తే హైదరాబాద్‌కు రైలు సదుపాయం కూడా తమకు అందుబాటులోకి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ప్రస్తుతం గుంటూరు డివిజన్‌లో ఉన్న 142 కిలోమీటర్ల సెక్షన్ సికింద్రాబాద్‌లోకి వెళ్లిపోతుంది. అప్పుడు ప్యాసింజర్ రెవెన్యూ పూర్తిగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వినుకొండ - శావల్యాపురం - రొంపిచర్ల - న్యూపిడుగురాళ్ల సెక్షన్‌లో ఎక్కువ రైలు సర్వీసులు ప్రవేశపెట్టుకోగలిగితే కొంతలో కొంతైనా రికవరీ జరుగుతుందన్న సూచిస్తున్నారు.

ప్రతి విద్యార్థికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు

- రెండవసారి దరఖాస్తు లేకుండా ఆధార్‌తో జారీ
- ఉమ్మడి జిల్లాలో సర్టిఫికెట్లు జారీచేస్తున్న రెవెన్యూ అధికారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు.. విద్యార్థులు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా కూటమి ప్రభుత్వం తీపి కబురు అందిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పాఠశాల స్థాయి నుంచి ఉన్నత చదువులు పూర్తయ్యేంత వరకు ఏటా తమకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటారు. వాటి కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతుంటారు. ఇక విద్యార్థులకు అలా తిరగాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ఆధారంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 18 లక్షల మందికి పైగా విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. ఇప్పుడు ఇస్తున్న సర్టిఫికెట్లు పొరపాటున కనిపించకుండా పోతే.. ఆ విద్యార్థి ఆధార్ నంబరు సమీప సచివాలయంలో ఎంటర్ చేస్తే మళ్లీ సర్టిఫికెట్‌ను నిమిషాల వ్యవధిలో తీసుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రతి ఏడాది ఎంసెట్, బీటెక్, డిగ్రీ కళాశాలలో చేరేందుకు ప్రతి విద్యార్థికి పలు రకాల సర్టిఫికెట్లు తప్పనిసరిగా కావాల్సి ఉంది. నిర్దిష్ట గడువులోగా వాటిని ఆయా కళాశాలలో అందజేయాల్సిన విద్యార్థులు కొందరు చివరి నిమిషం వరకు ఏఏ సర్టిఫికెట్లు ఇవ్వాలో తెలుసుకోలేకపోతున్నారు. తీరా తెలుసుకున్న తర్వాత దరఖాస్తు చేయడం, వాటిని తీసుకొని కళాశాలలో అందజేయడం పెద్ద ప్రహసనంగా మారుతోంది. ఇటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి విద్యార్థికి పర్మినెంట్ కుల, ఆదాయ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం జారీ చేస్తుంది. దీంతో ప్రతి విద్యార్థి ప్రతి సంవత్సరం దరఖాస్తు చేసుకునే వెతలు తప్పుతాయి. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 5.28 లక్షలు, గుంటూరు జిల్లాలో 8.11 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.50లక్షలకు పైగా విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లను రెవెన్యూ అధికారులు అందజేయనున్నారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన కలిగి ఉండాలి

- కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఇన్‌చార్జి మనోజ్‌పూరి గోస్వామి


డ్రోన్ వాడకంపై రైతులకు వివరిస్తున్న కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం బృందం

ప్రత్తిపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్ర ఇన్‌చార్జి మనోజ్ పూరి గోస్వామి తెలిపారు. మండల పరిధిలోని గొట్టిపాడులో ప్రత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది, అపరాల పంటలలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రెండు రోజుల పాటు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాలను ఆయన సందర్శించారు. విత్తు నుంచి రైతులు తీసకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రత్తి పంట 45 రోజుల సమయంలో రసం పీల్చు పురుగు, పచ్చదోమ, తామర పురుగు, పేనుబంకలను గమనించడం జరుగిందని, దీని నివారణకు వేప నూనెను ఒక లీటరు నీటికి మూడు మిల్లీ లీటరు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ప్రత్తి పొలాల్లో జిగురు, పసుపు, నీలం అట్టలు ఎకరాకు పది నుంచి పదిహేను ఏర్పాటు చేసుకోవడం వల్ల రసం పీల్చు పురుగులను అదుపు చేయవచ్చునన్నారు. ప్రస్తుత దశలో ఎకరాకు ఎనిమిది చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా అలాగే డ్రోన్‌లను ఉపయోగించే విధానం, ప్రత్తి పంటలో డ్రోన్ ద్వారా పిచికారి చేసే విధానం గురించి సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కే వీరయ్య చౌదరి, సమగ్ర సస్యరక్షణ అధికారి డాక్టర్ టీ ప్రేమ రంజితం, ఏడీఏ మోహనరావు,ఏవో సుగుణ బేగం పాల్గొన్నారు.

బర్లీ పొగాకు సాగు కట్టడికి టాస్క్‌ఫోర్సులు

- జిల్లా, డివిజనల్, మండల స్థాయి బృందాలతో పర్యవేక్షణ

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హెడ్ బీఆర్‌జీ/బర్లీ/బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసి ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోవడంతో ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే ఆయా రకాల పొగాకుని రైతులు సాగు చేయకుండా కట్టడి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం టాస్కు ఫోర్సు బృందాలను ఏర్పాటు చేసింది. తరచుగా పర్యటనలు చేసి నివేదికలు తెప్పించుకొని పైన పేర్కొన్న మూడు కేటిగిరీల పొగాకుని రైతులు సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇందుకోసం జిల్లా, డివిజనల్, మండల స్థాయి టీమ్‌లు ఏర్పాటు చేసింది. త్వరలోనే జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి టాస్కు ఫోర్సులకు సంబంధించి విధి విధానాలపై చర్చిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, డీఎంహెచ్‌వో, న్యాయ అధికారి సభ్యులుగా, కన్వీనర్‌గా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని టాస్కుఫోర్సు బృందంలో ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మండలాల నుంచి ప్రతి వారం నివేదికలు తెప్పించుకొంటుంది. అలానే గ్రామాల్లో పర్యటించి క్రాస్ చెక్ చేస్తుంది. నర్సరీ ఉత్పత్తిదారులు, స్థానిక ట్రేడర్లు, దళారులు, కంపెనీల ప్రతినిధులు, టుబాకో గోడౌన్లు, ప్రాసెసింగ్ యూనిట్లలో ఏమైనా సమస్యలు తలెత్తితే పరిష్కరిస్తుంది. లక్ష్యం నిర్దేశించుకొన్న మండలాలు, క్లస్టర్లలో పొగాకు సాగు చేపట్టకుండా చర్యలు తీసుకొంటుంది. డివిజనల్ టాస్కు ఫోర్సుకి చైర్మన్‌గా ఆర్డీఓ, సభ్యులుగా డీఎస్పీ, డివిజనల్ వైద్య అధికారి, ప్రోగ్రసివ్ రైతు సభ్యులుగా ఉంటారు. కన్వీనర్‌గా ఏడీఏ(ఆర్) వ్యవహరిస్తారు. మండల స్థాయిలో బృందానికి తహసీల్దార్ చైర్మన్‌గా, ఎస్ఐ, మెడికల్ అధికారి, ప్రోగ్రసివ్ రైతు సభ్యులుగా, ఎంఏవో కన్వీనర్‌గా ఉంటారు. నర్సరీలలో పొగాకు మొక్కలు పెంచకుండా నోటీసులు జారీ చేస్తారు. కొనుగోలు చేస్తామన్న ఒప్పందాలను రద్దు చేయిస్తారు. రైతులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పొగాకు సాగు చేపట్టకుండా చూస్తారు.

గతేడాది గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో బర్లీ పొగాకుని రైతులు విపరీతంగా సాగు చేశారు. పంట సాగు చేయడానికి ముందు తాము బర్లీ పొగాకుని కొనుగోలు చేస్తామని చెప్పిన ఎగుమతి కంపెనీలు తీరా పంట వచ్చాక విదేశాల నుంచి డిమాండ్ లేదని ముఖం చాటేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సానుకూల స్పందన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే రైతులను ఆదుకునేందుకు రంగంలోకి దిగింది. దాదాపుగా రూ. 300 కోట్లు విడుదల చేసి మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకుని కొనుగోలు చేయిస్తోంది. బాపట్ల జిల్లాలో 66,814, గుంటూరులో 14,094, పల్నాడులో 7,875 ఎకరాల్లో గతేడాది రైతులు బర్లీ పొగాకు సాగు చేశారు. దాదాపుగా 102.48 మిలియన్ కేజీల పొగాకుని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అయినప్పటికీ క్వింటాల్ రూ. 12 వేలుగా ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేపట్టింది.

కొనసాగుతున్న వరద ఉధృతి

విజయపురిసౌత్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం శ్రీశైలం నుంచి 4,31,678 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 583.50 అడుగులు ఉంది. ఇది 293.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9019, ఎడమ కాలువ ద్వారా 6401, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,155, 26 క్రస్ట్‌గేట్లను ఎత్తి 3,54,718 ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 4,04,993 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 32.58 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 3,96,223 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, 13 గేట్ల ద్వారా 3,90,778, మొత్తం 4,07,778 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

పులిచింతలకు 4,36,601 క్యూసెక్కులు..

రెంటచింతల,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 4,36,601 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ నాగరాజు,సుబ్రహ్మణ్యం తెలిపారు. చెప్పారు. డ్యాం 20 గేట్లకు గాను 13 గేట్లను 4.5 మీటర్లు, 5 గేట్లను 5 మీటర్ల మేర ఎత్తామన్నారు. సాగర్ నుంచి 4,04051 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 74.31 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.284 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు తెలిపారు.


సాగర్ 26 కస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి భారీగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి శుక్రవారం రాత్రి వరకు 4,33,393 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది. రిజర్వాయర్‌లో 12.5 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4,16,622 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాలువకు 9,750, పశ్చిమ డెల్టాకు 7, 26 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నందున దిగువ నదీ తీర ప్రాంత వాసులు లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

నిలకడగా కృష్ణానదిలో వరద ప్రవాహం


పెనుమూడి వద్ద వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ పుష్కర ఘాట్


కొల్లూరు కరకట్ట దిగువున వరద నీటిలో మునిగిన రేకుల షెడ్డు

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి కొంత మేరకు వరద ఉధృతి తగ్గినప్పటికీ అమావాస్య పోటు కారణంగా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో అడుగుకు మించి వరద నీటి ప్రవాహం తగ్గలేదు. శుక్రవారం ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం కంటే సుమారు లక్ష క్యూసెక్కులు తక్కువ దిగువకు విడుదల కావడంతో 3 అడుగులు మేర కృష్ణా నదిలో నీటి తగ్గాల్సి ఉంది. కానీ, అమావాస్య పోటు కారణంగా కేవలం ఒక్క అడుగు మాత్రమే తగ్గడంతో లోతట్టు ప్రాంతాల్లో ముంపునకు గురైన వాణిజ్య పంటల్లో వరద నీరు నిలిచిపోయింది. పైగా లోతట్టు ప్రాంతాల్లో చేరిన వరద నీరు వరద తగ్గుముఖం పట్టినప్పటికీ వెనక్కి వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో ముంపునకు గురైన పంటలు కుళ్లిపోతాయని రైతులు చెబుతున్నారు. కొల్లూరు కరకట్ట దిగువ నుంచి ఆవులవారిపాలెం, పెసర్లంకకు వెళ్లే రహదారులకు ఇరువైపులా వరద నీరు చేరడంతో సముద్రాన్ని తలపిస్తున్నాయి. అక్కడక్కడ లోతట్టు ప్రాంతాల్లో ఇటుక పరిశ్రమదారులు నిల్వ ఉంచిన ముడిసరుకు సైతం వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో నష్టపోయామని నిర్వాహకులు వాపోతున్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లోలెవల్ చప్టాలపై వరద ఉధృతి కొనసాగుతోంది. రెండు చోట్ల పోలీసు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

వరద ప్రవాహం తగ్గుముఖం

రేపల్లె, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టటంతో తీరప్రాంత వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా వరద పోటెత్తడంతో కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడిపారు. భట్టిప్రోలు మండలం పెసర్లకకు వెళ్లే చిన్నరేవు, ఓలేరు చిన్నరేవుల్లో వరద నీరు రెండు అడుగుల మేర తగ్గింది. అరటి, కంద, పసుపు, కూరగాయపంటలు పొలాల్లో నీరు నిలిచే ఉంది. ఇదే విధంగా నీరు బయటకు పోకుంటే మొక్క కిందబాగం నానిపోయి పనికిరాకుండా పోతుందని రైతులు చెబుతున్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో పాదయాత్ర

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇస్కాన్ పాదయాత్ర బృందం శుక్రవారం మార్కాపురం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి జవహర్‌నగర్ కాలనీలోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి మహా హరి నామ సంకీర్తన చేస్తూ ప్రధాన వీధుల్లో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం వరకు చేరుకున్న తర్వాత అక్కడ మహాహారతి నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఇస్కాన్ ఆల్ ఇండియా పాదయాత్ర అధ్యక్షుడు స్వామీజీ శ్రీమాన్ ఆచార్య ప్రభుజీ ప్రవచనం ఇచ్చారు.

చెంచు కుటుంబానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో పరామర్శ

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజివారిపల్లి పంచాయతీ పరిధిలోని శాంతి నగర్ గిరిజన గూడెంలో నివాసం ఉంటున్న పులిచెర్ల చిన్న దేవయ్య అనే వ్యక్తి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న శ్రీశైలం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి గూడెంలోని మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. వారితో మాట్లాడి మృతుని మట్టి ఖర్చుల కోసం రూ. 5వేల రూపాయలను ఆయన వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట వైద్యులు కోటానాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్‌చార్జి.. పెండింగ్

(5వ పేజీ తరువాయి)

అనుమతి ఇస్తే నిధులు జమవుతాయని వారు సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తుంది. ఐజీ అనుమతి ఇవ్వాలంటే ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని సమాచారం.

అప్పుల్లో కూరుకుపోతున్నాం

గ్రామ పంచాయతీలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం విడుదల చేసి ఎనిమిది నెలలు దాటింది. కానీ ఇంతవరకు గ్రామ పంచాయతీలకు జమ చేయలేదు. గ్రామాల్లో ఏ చిన్న అవసరం వున్నా అప్పు చెయ్యాల్సి వస్తుంది. పెండింగ్‌లో ఉన్న సర్‌చార్జి నిధుల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలపాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సంవత్సరం నుంచి సర్‌చార్జి రాలేదని గుంటూరు జిల్లా వెంగళాయపాలెం సర్పంచ్ నల్లపాటి లలితకుమారి తెలిపారు.

కబడ్డీ కోచ్ దుర్గాప్రసాద్ మృతికి సంతాపం


దుర్గాప్రసాద్ (ఫైల్)

ఒంగోలు(రూరల్), ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి) : సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, కబడ్డీ కోచ్ దుర్గాప్రసాద్ శుక్రవారం అనారోగ్యంతో చీరాలలో తన స్వగృహంలో మృతి చెందడంపై జిల్లా కబడ్డీ అసోషియోన్ అధ్య క్షుడు కుర్రా భాస్కరరావు, ఇతర సభ్యులు తమ ప్ర గాఢ సంతాపం వ్యక్తం చేశారు. దుర్గాప్రసాద్ గత 30 సంవత్సరాలుగా కోచ్‌గా ఎందరో క్రీడాకారులను తయారు చేశారని కొనియాడారు. కాకినాడలోని స్పోర్ట్ హాస్టల్ కోచ్‌గా ఉండి విద్యార్థులను క్రమశిక్షణ గల క్రీడాకారులు తీర్చిదిద్దారని చెప్పారు. అంతేగాకుండా ప్రకాశం జిల్లా డీఎస్‌డీవోగా పని చేశారన్నా రు. ఆయన లేని లోటు క్రీడాకారులకు తీరని లోటని పేర్కొన్నారు.

వంద ఉపన్యాసాల కన్నా ఒక్క పాట శక్తివంతమైంది

ప్రజా కళాకారులు దేశంలోని రుగ్మతలపై సాంస్కృతికోద్యమం నిర్వహించాలి : సీపీఐ రామకృష్ణ

హాజరైన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఏపూరి సోమన్న

ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శనలు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వంద ఉపన్యాసాల కన్నా ప్రజా కళాకారుని ఒక పాట ఎంతో శక్తివంతమైనదని, ప్రజలను చైతన్యపరుస్తూ దూసుకుపోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ చెప్పారు. సీపీఐ వందేళ్ల పండుగను పురస్కరించుకుని ఒంగోలులో ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్న సభలను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ రామకృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశం నేడు క్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. అటువంటి పరిస్థితుల్లోనూ డాక్టర్ అంబేద్కర్ రచించిన లౌకిక రాజ్యాంగం గొప్ప స్ఫూర్తితో నిలుస్తోందన్నారు. బీజేపీపై వామపక్ష పార్టీలు సాగిస్తున్న పోరాటంలో ప్రజా కళాకారులు కీలక పాత్ర పోషించాలని చెప్పారు. ఈ సందర్భంగా సినీ దర్శకులు బాబ్జీ మాట్లాడుతూ తాము ఇంత గొప్ప స్థాయిలో ఉండటానికి ప్రజా నాట్యమండలినే కారణమన్నారు. ప్రజా వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, ఏపూరి సోమన్న ఆట, పాట, మాట ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నాయక్, కార్యదర్శులు చిన్నం పెంచలయ్య నాగరాజు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో నేటికీ కొనసాగుతున్న అంటరానితనం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సమాజంలో అంటరానితనం నేటికీ కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ చెప్పారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూలు ఆవరణలో జరుగుతున్న మూడో పుస్తక ప్రదర్శన కేంద్రాన్ని శుక్రవారం రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై దేవరాజు మహారాజు రచించిన హిందూత్వం సింహాసనంపై అబద్ధాల చక్రవర్తి అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఇంకా కులం, మతం అనే పేరుతో విభజన రేఖ ఉందన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం త్వరలో మనం జపాన్‌ని అధిగమిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర పబ్లిక్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వర రావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికీ ఆర్థిక అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ మూర్తి రచించిన వాడు-నేను అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో విజయవాడ పుస్తక ప్రదర్శన అధ్యక్షుడు కే లక్ష్మయ్య, మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

నల్లమలలో ఏం జరుగుతోంది?

చెక్‌పోస్టు దాటి తవ్వకాలకు ఎలా వెళ్ళారనేది ప్రశ్న

మూడు రోజులుగా మూడు వాహనాలతో పనులు

అసలు సూత్రధారులు ఎవరు

ఉద్యోగులు, నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్యంలో అసలు ఏమి జరుగుతుందో తెలియన పరిస్థితిలో ఫారెస్టు అధికారులు ఉన్నారా? అంటే నిజమే అన్నట్లు ఉంది. ఎర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి రెంజ్ పరిధిలోని చెన్నుపల్లి గూడెం సమీపంలోని విరుడుగుంట ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు అక్కడికి వెళ్ళి ఎక్స్‌కవేటర్, జీపు స్వాధీనం చేసుకోని ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రాంతంలోకి వారు ఎలా వెళ్ళారు.., ఎన్ని రోజులుగా తవ్వకాలు చేస్తున్నారు.., దానికి గల సూత్రధారులు ఏవరు అనేది విచారణలో తెలియాల్సి ఉంది.

చెక్ పోస్టులు దాటి ఏలా వెళ్లారు

గంజివారిపల్లి రెంజ్ పరిధిలో నల్లమల అటవీ ప్రాంతానికి వెళ్ళాలంటే గాంధీనగర్ గూడెం వద్ద ఫారెస్టు అధికారులు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఏ వాహనం వెళ్ళాలన్న, రావాలన్నా ఈ చెక్ పోస్టు దాటి వెళ్ళాల్సిందే. మరి ఈ రెండు (మూడు వాహనాలు అని ప్రచారం) వాహనాలు ఏలా వెళ్ళాయి... ఏవరు పంపించారు అనేది ప్రశ్నగా ఉండగా ఇందులో ఫారెస్టు అధికారుల హస్తం కూడా ఉందా అనేది అనుమానంగా ఉంది.

మూడు రోజులుగా తవ్వకాలు

అయితే ఈ ప్రాంతంలో మూడు రోజులుగా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మూడు రోజులుగా తవ్వకాలు జరుగుతుంటే ఫారెస్టు అధికారులకు తెలియకుండా ఉందా, కనిపించ లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.


ఫారెస్టు కార్యాలయంలో ఉన్న వాహనాలు (ఫైల్)

ప్రభుత్వ ఉద్యోగుల హస్తం

నల్లమల అటవీ ప్రాంతంలో గుప్త నిధుల తవ్వకాలకు సంబంధించి ఎర్రగొండపాలెం మండలంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల హస్తం ఉందని జోరుగా మండలం వ్యాప్తంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దానికి గల కారణం తవ్వకాలకు వినియోగించిన వాహనంలో ఓ వాహనం ప్రభుత్వ ఉద్యోగిదని సమాచారం. అంతేకాకుండా ప్రజాప్రతినిధులు కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌కవేటరుకు డీజిల్ కొట్టించే సమయంలో ఓ నాయకున్ని పలువురు చూసినట్లు తెలుస్తోంది. అత్యాస కోసం ఇటు ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు ఇలాంటి పురాతన దేవాలయాల్లో తవ్వకాలు చేస్తుంటే ఇంక వాటిని కాపాడేదేవరంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇద్దరు నిందితులు దొరికితే వాహనాలు ఎవరివో..దానికి సుత్రధారులు ఎవరో అధికారులు తెలసుకోలేక పోతున్నారా అంటూ ప్రజలు గుసగుసలాడున్నారు. దీనిపై రేంజర్ ప్రసన్న జ్యోతి, ఎఫ్ఎస్ఓ కరిముల్లాలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఏది ఏమైనా దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే చాల విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంది.


తవ్వకాలు చేసిన ప్రాంతంలో మట్టి గుంతలు(ఫైల్)

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

(5వ పేజీ తరువాయి)

సహా చుట్టుపక్కల ఉన్న చేనేత గ్రామాలు, చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, వరపర్ల పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ దరఖాస్తుల కోసం సచివాలయాల వద్ద బారులు తీరుతున్నారు. కాగా ఇప్పటికే మూడు జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక ఒక కొలిక్కి వచ్చింది. అర్హుల జాబితా ఇప్పటికే చేనేత, జౌళిశాఖ కార్యాలయాలకు చేరినట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 2,460 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. మంగళగిరి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువమంది షెడ్డులో నేసే కార్మికులు ఉన్నారు. వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్న డిమాండు వినిపిస్తోంది. దీనిపై మంత్రి లోకేశ్ కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కాగా పల్నాడు జిల్లాలో 280 మంది మాత్రమే అర్హులుగా ఉన్నట్లు తేలింది. అయితే బాపట్ల జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 7వేల పైచిలుకే ఉండే అవకాశం కనిపిస్తోంది. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పొందినవారి సంఖ్యే 7వేల పైచిలుకు ఉంది. అయితే అట్టడుగు వర్గానికి చెందిన కార్మికులను నేతన్న నేస్తం లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదు. అలాంటివారు కూడా ఇప్పుడు ఉచిత విద్యుత్ స్కీముకు దరఖాస్తు చేసుకుంటున్నారు. వారిని కూడా కలుపుకుంటే మూడు జిల్లాల్లో ఈ సంఖ్య మరో ఐదువేల వరకూ పెరిగే అవకాశం కనిపిస్తోంది.

క్విస్‌లో 110మంది రక్తదానం


ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్, బ్రహ్మకు మారీస్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ రక్త దాన శిబిరం జరిగింది. సుమారు 110 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదా నం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. దాది ప్రకా శమణి 18వ వర్ధంతి సందర్భంగా భారత, నేపాల్‌లలో ఒకే రోజు 2 లక్షల యూనిట్ల రక్తం సేకరించారన్నారు. రక్తసేకరణలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సాధించినట్లు బ్రహ్మకుమారీస్ తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి తెలిపారు. కార్యక్రమంలో నవనీత్ కృష్ణన్, రేవతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రెర్రగా..

- నేడు భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు రాజా, నారాయణ
- రేపు, ఎల్లుండి ప్రతినిధుల సభలు

ఒంగోలు వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్రమహాసభలకు ఆ పార్టీశ్రేణులు, ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి సంస్థాగతంగా సీపీఐ గ్రామస్థాయి నుంచి అఖిలభారత స్థాయి వరకు మహాసభలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహాసభలు పూర్తికాగా ఈనెల 23 నుంచి 25 వరకు రాష్ట్రమహాసభలు జరుగుతున్నాయి.

ఒంగోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మూడ్రోజులుపాటు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాభలకు నగరం ముస్తాబైంది. మూడేళ్ల రాష్ట్రంలో ఆ పార్టీ నిర్వహించిన కార్యక్రమాల సమీక్ష, రాష్ట్రంలో, దేశంలో ప్రస్తుత రాజకీయపరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చించి వచ్చేమూడేళ్ల చేపట్టనున్న భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నారు. రానున్న మూడేళ్ల పాటు పార్టీని నడిపించే నూతన నాయకత్వ ఎన్నిక కూడా ఈ మహాసభల్లో జరగనుంది. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి మహాసభలకు అధిక ప్రాధాన్యత ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో ఘన కీర్తి

ఉమ్మడి జిల్లాలో సీపీఐకి గతంలో ఘన కీర్తి ఉంది. ప్రస్తుతం దీనికోసం ఆరాటపడుతున్నప్పటికీ జాతియోద్యమ కాలం నుంచే ఉమ్మడి జిల్లా పరిధిలో కమ్యూనిస్టు ప్రభావం అధికంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతాల్లో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి బీజం పడింది. 1937లో కొత్తపట్నంలో జరిగిన రాజకీయ పాఠశాల కాగా ఆ పాఠశాల ఒంగోలు ప్రాంతంలో ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు భావాజాలంతో ఉన్నవారి సహకారంతోనే జరిగింది. అనంతర కాలంలో కూడా ఉమ్మడి జిల్లాలో సాగు, తాగు, నీరు, భూసమస్యల పరిష్కారం, అంటరానితనం, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, రైతులు, వ్యవసాయ కార్మికుల పక్షాన నాటి కమ్యూనిస్టు నేతలు ముందుండి పోరాడారు. ఒకప్పుడు జిల్లాలోని వివిధ శాసనసభ స్థానాల నుంచి కమ్యూనిస్టు నేతలు ప్రాతినిధ్యం వహించారు. నాటి నందికొండ (నాగార్జునసాగర్) ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న వెలిగొండ ప్రాజెక్టు వరకు సీపీఐ నాయకత్వాన చేపట్టిన పోరాటాల ఫలితం అన్నది నేటి తరానికి అవగాహన లేకపోయినా చరిత్రలో గుర్తించగల అంశాలు. అలాంటి వారస్వం ఉన్న పార్టీ నేడు బలహీనపడి ఉనికి కోసం ఆరాటపడే స్థితికి చేరింది.

నగరంలో తొలిసారి మహాసభలు

నాటిపోరాట చరిత్రకు కేంద్రంగా ఉన్న ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు తొలిసారి జరుగుతున్నాయి. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లోనూ ప్రత్యేక గుర్తింపు ఉన్న ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, వామపక్ష, అభ్యుదయ వాదులందరూ ఆప్యాయంగా 'అన్న' అంటూ పిలుచుకునే నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) అధ్యక్షుడుగా విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులతో కూడిన ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో మహాసభల నిర్వహణకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.


ఫ్లెక్సీలతో ఎర్రబారిన ఒంగోలు

నగరం ఎరుపుమయం

నగరంలోని ప్రధాన వీధులు, కూడళ్లలో సీపీఐ జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, తోరణాలు, మహాసభలకు వచ్చే అగ్రనాయకులకు స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మూడు రోజులుగా సీపీఐ మహసభల ప్రచారంలో భాగంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్‌రూము ఆవరణలో ఉత్సాహంగా ప్రజాకళా ఉత్సవాలు సాగుతున్నాయి. మహాసభల తొలిరోజైన శనివారం నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరగనున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు బస్టాండు సెంటర్ నుంచి అద్దంకి బస్టాండు సమీపంలోని కూరగాయాల మార్కెట్ మైదాన ప్రాంగణం వరకు భారీ ర్యాలీ జరుగుతుంది. అనంతరం అక్కడ బహిరంగసభ నిర్వహిస్తారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా పార్టీశ్రేణులు తరలిరానున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొనున్నారు. ఆది, సోమవారాల్లో నగర సమీపంలోని ఎస్‌వీజీఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరగనుంది. గత పక్షం రోజులుగా జిల్లా సీపీఐ నాయకత్వంతో కలిసి ఆ పార్టీరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జి.ఈశ్వరయ్య నేతృత్వంలో పలువురు యువజన, విద్యార్థిసంఘాల రాష్ట్ర నాయకులు మహాసభ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గిరిజనుడిపై దాడి చేసిన వైసీపీ నేత

అవీఇవీ

బాధితుడిని పరామర్శించిన ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్


చికిత్స పొందుతున్న ఎర్రన్నను పరామర్శిస్తున్నదారునాయక్

కంభం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిన్నర క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు వేశాడన్న కారణంతో దాసరి చిన్న ఎర్రన్న అనే గిరిజనుడిపై వైసీపీకి చెందిన ఎక్కడి బాదరయ్య ఇనుపరాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన గురువారం రాత్రి అర్ధవీడు మండలం బొమ్మిలింగం చెంచు కాలనీలో జరిగింది. అర్ధవీడు పోలీసుల కథనం ప్రకారం బొమ్మిలింగం చెంచు కాలనీకి చెందిన దాసరి చిన్న ఎర్రన్న తెలుగుదేశం పార్టీ అభిమాని కాగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బాదరయ్య చెంచు కాలనీకి వెళ్లి వైసీపీకి ఓటు వేయండని బెదిరించాడు. అయితే కాలనీలోని దాసరి ఎర్రన్నతోపాటు పలువురు చెంచులు టీడీపీ అభ్యర్థికి ఓటు వేశారు. దీనిని మనసులో పెట్టుకున్న బాదరయ్య గురువారం రాత్రి దాసరి చిన్న ఎర్రన్నపై ఆగ్రహం వ్యక్తం చేయడమేగాక తాను వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన ఎర్రన్నను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరచారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

ఎర్రన్నను పరామర్శించిన ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు

చెంచు కాలనీకి చెందిన దాసరి చిన్న ఎర్రన్నపై వైసీపీ నాయకుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని, ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్న విషయం తెలుసుకున్న ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఎర్రన్నను పరామర్శించారు. అనంతరం దారు నాయక్ మాట్లాడుతూ ఎస్టీ కులానికి చెందిన ఎర్రన్నపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వైసీపీ నాయకుడు బాదరయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అర్ధవీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలబావులతో పొంచి ఉన్న ప్రమాదాలు

పలు గ్రామాలలో వినియోగంలో లేని పురాతన నేలబావులు

సీసీ రోడ్లు వేయటంతో రోడ్డు అంచున ఉన్న బావులతో ప్రజలు బెంబేలు


కూకట్లపల్లి గ్రామంలో రోడ్డు వెంబడి ప్రమాదకరంగా ఉన్న నేలబావి

బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలంలో ప్రజల దాహార్తి తీర్చిన నేల బావులు ఇప్పుడు పాడుపడిపోయి ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గ్రామాలలో చిన్నారులు, వాహన చోదకులు రాత్రుళ్ల రోడ్ల వెంబడి వెళుతుంటే ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్నిసార్లు బావులు అక్కడ ఉన్నాయన్న సంగతి కూడా మరిచి పోతున్నామని అంటున్నారు. మండలంలోని గొర్రెపాడు గ్రామ సెంటర్‌లో రోడ్డు పక్కనే ఉన్న పురాతన బావితోపాటు చుట్టూ చిల్లచెట్లతో నిండి ఉంది. ఆ బావితో ప్రజలు ప్రతి రోజూ భయాందోళన చెందుతున్నారు. పశువులు, చిన్నారులు అటు వైపు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. అలానే కూకట్లపల్లి గ్రామంలో ప్రధాన సీసీ రోడ్డు అంచునే పురాతన బావి రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ బావుల్లో నీరు కూడా లేదు. పంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న పురాతన బావులను పూడ్చి వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బడి బయటఉన్న విద్యార్థులను స్కూలులో చేర్పించాలి


ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు చొరవ చూపాలి

బాపట్ల జిల్లా డీఈవో యస్.పురుషోత్తం


పర్చూరులో మాట్లాడుతున్న బాపట్ల డీఈవో పురుషోత్తం

పర్చూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి యస్. పురుషోత్తం చెప్పారు. దీంతోపాటు డ్రాప్ బాక్స్‌లో ఉన్న విద్యార్థులను కూడా వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఈనెల 25వ తేదీలోపు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. శుక్రవారం చీరాల డివిజన్ పరిధిలో ప్రధానోపాధ్యాయుల సమావేశం స్థానిక రోటరీ భవనంలో జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఎఫ్-ఏ 1 మార్కులు 25వ తేదీలోపు నమోదు చేయాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ప్రతి తరగతికి ఒకటి చొప్పున (6 నుంచి10వ తరగతులు) 31వలోపు పూర్తిచేయాలని చెప్పారు బెస్ట్ టీచర్ అవార్డుకు నామినేషన్‌లు 24లోపు పంపించాలన్నారు. విధిగా ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఈవో గంగాధర్, ఎంఈవో శివకోటేశ్వరరావు, పి.వెంకట్రామయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చెంచు గూడాలలో నీటి సమస్యకు పరిష్కారం


చేతి పంపునకు మరమ్మతులు చేసి పరిశీలిస్తున్న సిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి గిరిజన గూడెంలో మరియు పందివానిపల్లి లో చెంచు కుటుంబాలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ వారు శుక్రవారం సమస్యను పరిష్కారం చూపారు. ఆయా గూడాలలో నీటి ఎద్దడి విషయం తెలుసుకున్న సంస్థ ఎర్రగొండపాలెం కో ఆర్డినేటర్ డి వెంకట్రావు అధికారులు, నాయకులు దృష్టికి తీసుకెళ్లారు. వారి సహాయ సహకారాలతో ఆ రెండు ప్రాంతాలలో నీటి సరఫరా చేసి నీటి సమస్యను తీర్చినట్లు వారు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచ్‌లు డి సుబ్బారెడ్డి, అరుణా బాయ్, పంచాయితీ కార్యదర్శి రామ సుబ్బయ్య, మరియు సంస్థ సిబ్బంది బి కామ్లానాయక్, డి బాల లక్ష్మీ బాయ్, ఆయా గ్రామాల విటిడిఏ సభ్యులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పాము కాటుకు గురై రైతు మృతి

● నేరుగా ఆస్పత్రికి వచ్చి అక్కడే కుప్పకూలిన దైన్యం


రైతు వెంకటేశ్వర్లు మృతదేహం

అద్దంకి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై రైతు మృతిచెందిన ఘటన మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు(40) శుక్రవారం ఉదయం పొలానికి పశువుల మేత కోసం వెళ్లాడు. అక్కడ పాము కరవడంతో కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించి, నేరుగా అద్దంకిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు వచ్చాడు. అక్కడ వారు వైద్యం నిరాకరించడంతో అదే వాహనం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి అక్కడే కుప్పకూలాడు పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎలుకల మందు తిని వ్యక్తి మృతి

● కుటుంబపోషణ భారంగా మారి ఆత్మహత్య

అద్దంకి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): కుటుంబపోషణ భారంగా మారడంతో ఆందోళనతో ఎలుకల మందుతిన్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని గరటయ్యకాలనీ 21వ లైన్‌లో నివాసం ఉండే ఓరుపల్లి సుబ్బారావు(45)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహమైంది. వారి కుంటుంబాల్లో విభేదాలతో వారు కూడా సుబ్బారావు వద్దే ఉంటున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారమై ఈ నెల 20న సుబ్బారావు ఎలుకల మందు తిన్నాడు. ఒంగోలు రిమ్స్ లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం ఒంగోలు రిమ్స్ నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ లైన్ పనుల కారణంగా భవానిసెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శనివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

విద్యార్థులు సేవల్లో భాగస్వాములు కావాలి


ఇంట్రాక్టు క్లబ్ విద్యార్థులతో రోటరీ ప్రతినిధులు

బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రత్యేక క్లబ్‌గా ఏర్పడి సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యులు కావాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రావి.అంకమ్మచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో మార్టూరు రోటరీ క్లబ్ ద్వారా 20 మంది విద్యార్థులతో కలిసి ఇంట్రాక్టు క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామాలలో ఎక్కువైన సేవా కార్యక్రమాలు చేయాలంటే విద్యార్థులను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి నాగేశ్వరరావు, గోనుగోంట్ల రవికుమార్, ప్రధానోపాధ్యాయులు హనుమంతురావు,రోటేరియన్ గంగాధర్, డేవిడ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గిరిజనులకు ఆర్థిక భరోసా

● ఎస్టీలకు ఉపాధి జాబ్‌కార్డులు పంపిణీ


గిరిజనులకు జాబ్‌కార్డులు అందిస్తున్న ఎంపీడీవో శివన్నారాయణ

తోటవారిపాలెం(చీరాల), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులతో ఎస్టీలకు ఆర్థికభరోసా కలుగుతుందని ఎంపీడీవో శివన్నారాయణ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీవో దాసు ఆధ్వర్యంలో మండల పరిధిలోని తోటవారిపాలెం రామయ్య కాలనీలోని 50 ఎస్టీ కుటుంబాలకు ఉపాధి జాబ్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాము, విజయ్‌కుమార్, సుజాత, భారతీ, పావని తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రబీలో పొగాకు చేయవద్దు

ఇంకొల్లు, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి) : రానున్న రబీలో ఎవరూ పొగాకు సాగు చేయవద్దని పర్చూరు ఏడీఏ జీబీ ప్రవీణ్ సూచించారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, జొన్న పంటలు సాగుచేయాలన్నారు. మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయకులు సిహెచ్.రమాదేవి పాల్గొని రైతులకు సూచనలు చేసారు. పచ్చిరొట్ట సాగుతో చౌడుభూములు మంచి భూములుగా మారతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల వ్యవసాయాధికారి సరళ, మండల వ్యవసాయాధికారి మేరమ్మ, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0 ఎఫ్.వై 2023-24పై మండల స్థాయి అధికారులకు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్ర రావు, ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి స్వామిత్వ సర్వే పారదర్శకంగా చేయాలని తహసీల్దార్ జె.ప్రభాకరరావు గ్రామదర్శులకు సూచించారు. గ్రామాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్‌లు కృషి చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, గ్రామ ఆదాయాలు ఎలా పెంచుకోవాలి, 2025-26 ఆర్‌జీఎస్ఎ వార్షిక కార్యాచరణ ప్రణాళికపై రిసోర్స్‌పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుధాకరరావు, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖ ఏ.ఈలు డి.దాసు, జి.రాజశేఖర్, ఏపివో లక్ష్మీదేవి, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అద్దంకి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి శుక్రవారం రోజు దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాల నుండి సుమారు 400 మంది మహిళా భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలలో పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో పూజా సామగ్రి అందజేశారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వేటపాలెం(చీరాల) : వేటపాలెం మండలం అనుమల్లి పేటలో వేంచేసిన శ్రీమహాలక్ష్మీ అమ్మవారిని భక్తులు శాకాంబరి అలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. డ్రై ఫ్రూట్స్‌తో సామూహిక పూజలు చేశారు.



వేటపాలెంలో శాకంబరిగా అమ్మవారు, 108చీరాలతో అలంకరణ

అమ్మవారికి శ్రావణమాస ప్రత్యేక పూజలు

పంగులూరు: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పలు ఆలయాలలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలం లోని రామకూరు కొండపై కొలువు దీరిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీకాశీఅన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అర్చకస్వామి వెంకటేష్ అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ గావించారు.



రామకూరు కొండపై అమ్మవారి అలంకరణ, శింగరకొండలో పూజలు చేస్తున్న మహిళలు

108 చీరలతో అలంకరణ

అద్దంకి : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో 108 చీరలతో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ పూటుకూరి రామకోటేశ్వరరావు, పూజారి స్వర్ణ వెంకటసుబ్బారావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని దామావారిపాలెం లో లక్ష్మీనరశింహ స్వామి దేవాలయంలో శు క్రవారం అభిషేకాలు, వరలక్ష్మీ వ్రతములు నిర్వహించారు. భవానిసెంటర్ లోని వేయిస్తంభాల గుడిలో కుంకుపూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా సినీనటుడు చిరంజీవి జన్మదినం

పర్చూరు, అగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మవిభూషణ్ గ్రహీత సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను జనసేన, చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో శుక్రవారం పర్చూరు లో ఉత్సాహంగా పండుగ వాతావరణాన్ని తలపించే విధంగా నిర్వహించారు. ముందుగా బొమ్మల కూడలిలో చిరంజీవి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తులసి చంటి, దీర్ఘాల రమేష్‌నాయుడు, బోగాది మోహన్, బాలు, కఠారి సురేంద్రబాబు, కోటా శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, టి.శ్రీనివాసరావు, కంచనపల్లి రమేష్, గోగుల శ్రీను, తులసి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

చిరంజీవి జన్మదినం సందర్భంగా అద్దంకి నాంచారమ్మ ఆలయంలో చెందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 100 మంది నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.



కడవకుదురు, పర్చూరులో కేకు కట్ చేస్తున్న చిరంజీవి అభిమానులు

చినగంజాం : మండలంలోని కడవకుదురు గ్రామంలో కేంద్ర మాజీమంత్రి, పద్మ విభూషణ్, మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కడవకుదురులోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసేన మండల అధ్యక్షులు నందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కేకుకట్ చేసి నాయకులకు, అభిమానులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి హరినాయుడు, నాయకులు పెదసింగ్ వెంకటేష్, గాంధీ, నామన వెంకటేష్, గొల్లపూడి మస్తాన్‌రావు, సత్యనారాయణ, కే.నాగేశ్వరరావు, గాజుల మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించాలి


మాట్లాడుతున్న కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

అద్దంకిటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించేలా అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మవరం రైతు సేవా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో భూసారం పెంపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారానే ఎరువుల వినియోగించాలన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులను సాగుచేయాలన్నారు. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నాలన్నారు. వరి, మొక్కజొన్న పంటలలో వచ్చే తెగుళ్లు, పురుగులు గురించి వివరించి, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, గ్రామ సర్పంచ్ చావాల కల్యాణి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఈవో కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ రామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు అశోక్, వీఏఏ శేషయ్య, రైతులు పాల్గొన్నారు.

26న మండల స్థాయి శిక్షణ కార్యక్రమం

అద్దంకిటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశ మందిరంలో మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు ఏఎస్‌వో, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యాదర్శులు అందరు హజరు కావాలన్నారు.

26న మండల సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):సంతమాగులూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. సమావేశానికి గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొనాలన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అద్దంకి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): శింగరకొండ శ్రీరామవృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు శుక్రవారం అన్నదానం చేశారు. కొర్రపాటి కృష్ణచైతన్య, సాయిశ్రీ దంపతుల మొదటి వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. వృద్ధుల ఆశ్రమం కమిటీ చైర్మన్ రావూరి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఎంపీపీ బండారు అనూష సూచన

ఇంకొల్లు, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని ఇంకొల్లు ఎంపీపీ బండారు అనూష సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల పనితీరును మెరుగుపరుచుకునే అంశంపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. గ్రామాలలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కిరణ్ సూచించారు. సమస్యలపై ప్రజలతో చర్చించి వాటిని పరిష్కరించే దిశగా కార్యదర్శులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ రాజ్‌శాఖ అధికారి ఆనంద్, పంచాయతీ సెక్రటరీలు రామసుబ్బారెడ్డి, అడ్డగడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూష

ప్రభుత్వ విధానాలను అనుసరించే మద్యం దుకాణాలు

చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల నిర్వహణలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీ విధానంతోనే నిర్వహణ సాగుతుందని చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో చీరాల ప్రముఖులు, రిసార్ట్స్ నిర్వాహకులు, మద్యందుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటికే జారీ అయిన నోటిఫికేషన్ విధివిధానాలను వివరించారు. లాటరీ పద్ధతిలోనే దుకాణాల కేటాయింపు జరుగుతుందని వివరించారు. ఆసక్తి కలిగినవారు పేర్లు నమోదు చేసుకోవాలని, వారికి అన్నివిధాలుగా ప్రోత్సాహం అందిస్తున్నట్లు సీఐ తెలిపారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు

సినీఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ

మార్టూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో ఇద్దరు యువకులు మార్టూరులో సాయిబాబా గుడిలో పూజారిగా సేవలను అందిస్తున్న కె.హరిబాబు సెల్‌ఫోన్‌ను చాకచక్యంగా కొట్టేసిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకొంది. మధ్యాహ్నం సమయంలో మార్టూరు సెంటరు నుంచి స్కూటీపై ఇంటికి వచ్చిన హరిబాబు ఇంటిలోకి వెళుతున్న సమయంలో ఒక యువకుడు ద్విచక్రవాహనంపై వచ్చి హరిబాబు ముందు బైక్ పైనుంచి పడిపోతున్నట్లుగా నటించాడు. దాంతో హరిబాబు అతనిని పైకి లేపుతుండగా, మరో యువకుడు అక్కడకు వచ్చి హరిబాబుకు సాయం చేశాడు. అనంతరం ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు వెళ్లిపోయారు. తర్వాత ఇంటిలోకి వెళ్లిన హరిబాబు కొంతసేపటికి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను ఇద్దరు యువకులు తెలివిగా కాజేసినట్లు గ్రహించాడు. గత మూడురోజుల క్రితం హరిబాబు ఇంటికి సమీపంలోని ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుని ఇంటిముందు ఇటువంటి ఘటనే జరిగింది.

పావులూరులో నేత్రదానం

ఇంకొల్లు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరులో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన చిడిపూడి అంజమ్మ(80) శుక్రవారం మృతి చెందగా రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులు సుబ్బారెడ్డి, అంజిరెడ్డి, వెంకాయమ్మ, వరలక్ష్మీలను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావుజెట్టి స్వామి, బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి అభినందించారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈవో

మార్టూరు, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలోని పడమర ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో వస్రాం నాయక్ సందర్శించారు. అక్కడ రెండవ తరగతిలో కేవలం ఇద్దరు విద్యార్థులు ఉండటంతో, విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయురాలు రమాదేవికి సూచనలు చేశారు. అనంతరం తూర్పు ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి, అక్కడ శిథిలావస్థలో ఉన్న గదిని పరిశీలించారు. ఈ గదిలో తరగతులను నిర్వహించవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. తరువాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

బాలిక ఆపరేషన్‌కు ఎల్‌వోసీ మంజూరు


ఎల్‌వోసీని అందజేస్తున్న విజయ్‌కుమార్

మార్టూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మార్టూరు గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న ఏడేళ్ల బాలిక వెర్ర బోయిన లలితశ్రీకి ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.8 లక్షలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరుచేయించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో బాలిక తండ్రి అశోక్‌కు రూ.8 లక్షలు మంజూరుకు చెందిన ఎల్‌ఓసీని మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ చేతులమీదుగా అందజేశారు. యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన బొబ్బేపల్లి అంజమ్మకు రూ.70 వేలు ఎల్‌ఓసీని టీడీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పొగడదండ రవి, క్యాంపు కార్యాలయ ప్రతినిధులు వెంకట్, అఖిల్, సంపత్ పాల్గొన్నారు.

అవగాహనతోనే రోగ నియంత్రణ సాధ్యం

● మహిళా మండలిలో హెచ్‌ఐవీపై అవగాహన

చీరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీపై అవగాహనతోనే రోగ నియంత్రణ సాధ్యమని కౌన్సిలర్లు వెంకటస్వామి, యేసురాజు పేర్కొన్నారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో మహిళ మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ రోగుల పట్ల ప్రేమ పూర్వకంగా మెలగాలని సూచించారు. రోగం దోమకాటు, ఉమ్మి, మరుగు దొడ్లు వాడకం వల్ల, వస్తు మార్పిడి వంటి ద్వారా సోకదని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సరళ, సీయోనుకుమారి, విజయ్‌బాబు, సంధ్యారాణి, శ్రీగీత, దానమ్మ, జ్యోతి, దివ్యభాను, శిరీష పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంతో సమస్యలకు పరిష్కారం

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు


ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు

చీరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజాప్రభుత్వంతో ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 135 అర్జీలు రాగా, వాటిల్లో పెన్షన్ల కోసం 20, నివేశన స్థలాలు 110, ఇతర సమస్యలు 5 ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గంజి పురుషోత్తం, పద్మిని, ప్రసన్న ఉన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

మార్టూరు, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజుగారిపాలెంలో ఒంగోలులోని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వారి సహకారంతో మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు ఆధ్వర్యంలో ఈ నెల 24 వతేదీ ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తాళ్లూరి రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి బీపీ, షుగర్, ఈసీజీ, పీఎఫ్‌టీ వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా మందులు కూడా ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు.